నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 12-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:197 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

నామది లోన దలంతును?..
ఆమను లిడగల కొలంబియా నౌక మొగిన్
వ్యోమ పథమ్మున దిరుగుచు
క్షేమమ్ముగ విజయ యాత్ర చేసిన దినమున్

(12-4-1981 వ్యోమ నౌక కొలంబియా ప్రయోగం)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

నినాదాలు ఎవరైనా
నిమిషాల్లో ఇవ్వవచ్చు
సాకారం చేయకుంటే
సాకులెన్నో చెప్పవచ్చు
మేకిండియా కేంద్రమాడ
మడమ తిప్పే చేతలు
యంగిండియా రాష్ట్రమాడ
యూత్ కొలుపు మోతలు

-వేల్పుల నారాయణ
9440433475

కుటుంబ ప్రయోజనాలకే వారి ప్రాధాన్యం

-మా ప్రభుత్వ లక్షం సమ్మిళిత అభివృద్ధి
-ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ నిశిత విమర్శ
-వారణాసిలో రూ. 3880 కోట్లతో 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన

వారణాసి ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ప్రతిపక్షాలను తీవ్ర స్థాయిలో తూర్పారపడుతూ అధికారం కోసం వెంపర్లాడే వారి దృష్టి తమ సొంత కుటుంబాలను

ప్రోత్సహించుకోవడంపైనే ఉంటుందని, కానీ తన ప్రభుత్వం సమ్మిళిత అభివృద్ధి ధ్యేయంతో కృషి చేస్తుంటుందని చెప్పారు. వారణాసిలో రూ. 3880 కోట్లు విలువ చేసే 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం సభికులను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, 'దేశ సేవలో మాకు మార్గం చూపే మంత్రం ఎల్లప్పుడూ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'. ఇదే స్ఫూర్తితో మేము ప్రతి పౌరుని పరిస్థితి మెరుగుదల కోసం ముందుకు సాగుతూనే ఉంటాం' అని ఉద్ఘాటించారు. ఇందుకు విరుద్ధంగా అధికార లాలస ఉన్నవారు రేయింబవళ్లు రాజకీయ క్రీడలు ఆడుతుంటారని, జాతీయ ప్రయోజనాల దృష్టితో కాకుండా కుటుంబ ఆధారిత మద్దతు, కుటుంబం కేంద్రంగా అభివృద్ధిపైనే దృష్టి కేంద్రీకరించి వారు సాగుతుంటారని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోడీ తన పార్లమెంటరీ నియోజకవర్గంలో సభలో మాట్లాడుతూ, 'అధికారం కైవసం కోసం రాత్రింబవళ్లు ఆటలు ఆడుతుండేవారి సూత్రం 'పరివార్ కా సాథ్, పరివార్ కా వికాస్ (కుటుంబ మద్దతు, కుటుంబ వికాసం)' అని ఆరోపించారు. భోజ్‌పురిలో ప్రజలకు శుభాకాంక్షలతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన మోడీ దళిత సంస్కర్త మహాత్మా జ్యోతిబా ఫులే జయంతి సందర్భంగా ఆయన నివాళి అర్పించారు. సాంఘిక సమానత్వానికి, మహిళా సాధికారతకు ఆయన చేసిన కృషిని మోడీ గుర్తు చేశారు. సర్వతోముఖాభివృద్ధిపై తన ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని ప్రధాని పునరుద్ఘాటిస్తూ, 'కొత్త శక్తితో వారి సిద్ధాంతాలను మేము ముందుకు తీసుకువెళుతున్నాం' అని ఆయన చెప్పారు. తన నియోజకవర్గంలో కనిపించిన అభివృద్ధి గురించి మోడీ వివరిస్తూ, లోగడ పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాల లోటు ఉండేదని, కాని ఇప్పుడు కాశీ ఆరోగ్య రాజధానిగా మారుతోందని చెప్పారు. 'దాదాపు 10, 11 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో వైద్య చికిత్స పొందడంలో సమస్యలు ఉంటుండేవి. ఇప్పుడు మన కాశీ ఆరోగ్య రాజధానిగా కూడా రూపుదిద్దుకుంటోంది. ఢిల్లీ, ముంబయికి చెందిన పెద్ద ఆసుపత్రులు ఇప్పుడు ఈ ప్రాంతంలోని ప్రజలకు అందుబాటులోకి రావడమే కాకుండా రోగుల పట్ల మర్యాద కూడా పాటిస్తున్నాయి' అని మోడీ వారణాసిలో పలు ప్రముఖ ఆసుపత్రుల శాఖల ఏర్పాటు గురించి ప్రస్తావిస్తూ చెప్పారు. గత దశాబ్దంలో నగర పరివర్తన ప్రస్థానాన్ని మోడీ ప్రధానంగా ప్రస్తావిస్తూ, 'గడచిన పది సంవత్సరాల్లో బెనారస్ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. కాశీ సదా తన వారసత్వాన్ని పరిరక్షించుకుని, సముజ్జ్వల భవిష్యత్తు దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పుడు కాశీ కేవలం ప్రాచీనమైనది కాదు, కానీ నా కాశీ ప్రగతిశీలకమైనది' అని పేర్కొన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి కృషి గురించి ప్రధాని మోడీ మాట్లాడుతూ, 'ఈరోజు కాశీ పూర్వాంచల్ వికాస రథాన్ని నడుపుతోంది' అని చెప్పారు. 'ఇప్పుడు భారత్ అభివృద్ధి, వారసత్వ సంపద కలగలిపి ముందుకు సాగుతోంది, మన కాశీఇందుకు అత్యుత్తమ నమూనా' అని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఆత్మ ఈ విభిన్నతలోనే వసిస్తుంటుంది, కాశీ దీని అత్యంత రమణీయ దృశ్యం' అని ఆయన అన్నారు. జాతీయ సమైక్యతను పటిష్ఠం చేయడానికి దోహదం చేసే కాశీ తమిళ్ సంగమం వంటి పథకాల గురించి కూడా ఆయన మాట్లాడారు. ఆర్థిక రంగంలో ఉత్తర ప్రదేశ్ పరివర్తనను ప్రధాని మోడీ ప్రధానంగా ప్రస్తావించారు. 'ఉత్తర ప్రదేశ్ ఇక ఎంత మాత్రం అవకాశాల ప్రదేశం కాదు. అది ఇప్పుడు సత్తా ఉన్న, దృఢ సంకల్పం ఉన్న భూమి కూడా' అని ఆయన పేర్కొన్నారు. 'భారత్ తయారీ' ఉత్పత్తులు ప్రపంచ గుర్తింపు ఎలా పొందుతున్నాయో ఆయన వివరించారు. 'ఇప్పుడు యుపి సమస్త దేశానికి జియో ట్యాగింగ్‌లో నంబర్ వన్. అంటే మన సంస్కృతి, మన విషయాలు, మన నైపుణ్యాలు శీఘ్రంగా అంతర్జాతీయ గుర్తింపు పొందుతున్నాయని అర్థం' అని ఆయన తెలిపారు. వారణాసి, పరిసర జిల్లాలకు చెందిన డజన్ల కొద్దీ ఉత్పత్తులు జిఐ ట్యాగ్‌లు పొందాయని, వాటిలో నగరానికి చెందిన ప్రసిద్ధ తబలా, షెహనాయి, కుడ్య చిత్రాలు, ఎర్ర పేడా, బర్ఫీ వంటివి కూడా ఉన్నాయని మోడీ తెలియజేశారు. 2036 ఒలింపిక్స్‌ను భారత్‌లోనే నిర్వహించేలా చూసేందుకు తన ప్రభుత్వం పాటుపడుతోందని కూడా మోడీ తెలిపారు. భవిష్యత్తులోకి పురోగమిస్తూనే కాశీ పురాతన ఆత్మను పరిరక్షించాలన్న పిలుపుతో తన ప్రసంగాన్ని మోడీ ముగించారు. మోడీ శంకుస్థాపన చేసిన పథకాల్లో గ్రామీణాభివృద్ధి లక్షంగా చేసుకున్నవి ఉన్నాయి. వాటిలో 130 మంచినీటి ప్రాజెక్టులు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పిండ్రాలో ఒక పాలిటెక్నిక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని వారణాసి డివిజనల్ కమిషనర్ కౌశల్ రాజ్ శర్మ తెలియజేశారు. ప్రధాని రామ్‌నగర్‌లో పోలీస్ బ్యారక్స్, పోలీస్ లైన్స్‌లో ఒక ట్రాన్సిట్ హాస్టల్‌కు, నాలుగ గ్రామీణ రోడ్లకు కూడా ప్రారంభోత్సవం చేశారు. ఉత్తర ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరైనవారిలో ఉన్నారు.

ప్రజల ప్రాథమిక హక్కుల గురించీ ఆలోచించాలి

-ఇడికి సుప్రీం కోర్టు స్పష్టీకరణ
-ఎన్ఎఎన్ స్కామ్ కేసు ఢిల్లీకి బదలీ చేయాలన్న ఇడి పిటిషన్‌పై కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నాగరిక్ అపుర్తి నిగమ్ (ఎన్ఎఎన్) కుంభకోణం కేసును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకి బదలీ చేయాలని కోరుతూ ఇడి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తులకు ఉద్దేశించిన రాజ్యాంగం 32వ అధికరణం కింద రిట్ పిటిషన్‌ను ఎలా దాఖలు చేశారని ఇడిని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. తమ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలకు సుప్రీం కోర్టు నుంచి పరిష్కారాన్ని కోరేందుకు వ్యక్తులకు అధికారం ఇస్తూ రాజ్యాంగం 32వ అధికరణం 'రాజ్యాంగం నివృత్తి హక్కు'ను గ్యారంటీ ఇస్తుంది. ఆ హక్కుల అమలుకు కోర్టును నేరుగా ఆశ్రయించేందుకు అది వారికి వీలు కల్పిస్తుంది. బెంచ్ వ్యాఖ్యల దృష్ట్యా అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు పిటిషన్ ఉపసంహరణకు కోర్టు అనుమతి కోరారు. 'ఇడికి కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయి ' అని ఆయన చెప్పారు. 'ఇడికి ప్రాథమిక హక్కులు ఉన్నట్లయితే, అది ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలి' అని బెంచ్ చమత్కారపూర్వకంగా వ్యాఖ్యానించింది. ఆతరువాత పిటిషన్ ఉపసంహరణకు రాజును కోర్టు అనుమతించింది.

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ - రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 11: ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు అధికారులు వివరించారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ.) మొత్తం 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24269 కోట్ల అంచనాలతో డీపీఆర్ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరినగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవెలప్మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్ఖాన్పేట వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. హెచ్ఎండీఏతో పాటు ఎఫ్ఎస్టీఏ ను (ఫ్యూచర్ సిటీ డెవెలప్?మెంట్? అథారిటీ)ని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వామ్యులను చేయాలని చెప్పారు.

మూసీ పునరుజ్జీవనంపై సమీక్ష

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూ ఘాట్ వద్ద నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను ముఖ్యమంత్రి గారు పరిశీలించారు. మీర్ ఆలం ట్యాంక్‌పైన బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని చెప్పారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్‌ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెప్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలి. సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఉండే విధంగా డిజైన్లను ఎంచుకోవాలి. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్‌లో వివిధ చోట్ల ఐలాండ్లు ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలి.

సింగపూర్‌లోని 'గార్డెన్స్ బై ది బే' ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలి. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్‌తో కూడిన డిజైన్లు ఉండాలి. బోటింగ్‌తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలి. ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలి. వీపీపీ మోడల్లో ఈ ఐలాండ్ జోన్‌ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలి.

మీర్ అలం ట్యాంక్‌లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు రూపొందించాలి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీతో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించి ఆ మేరకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలి. మీర్ ఆలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్‌ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలి. ఇక్కడి అభివృద్ధి ప్రణాళికలను దృష్టిలో పెట్టుకొని జూ పార్కును అప్‌గ్రేడ్ చేయాలి. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలి. అభివృద్ధి ప్రతిపాదనలన్నీ పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా ఉండాలి? అని ముఖ్యమంత్రి సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , శ్రీనివాస రాజు , మున్సిపల్ శాఖ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టాన్ని ప్రజలకు అంకితం చేయబోతున్నాం: మంత్రి పొంగులేటి

భద్రాద్రి మణుగురు ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భూ భారతి చట్టాన్ని ప్రజలకు అంకితం చేయబోతున్నామన్నారు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. భద్రాద్రి మణుగురు

ప్రజా భవన్ లో పొంగులేటి మీడియాతో సమావేశం అయ్యారు. గత ప్రభుత్వంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుని రాజు చేస్తామని గత ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. రైతు రుణమాఫీ చేసిన ప్రభుత్వం.. ఇందిరమ్మ ప్రభుత్వమని పేర్కొన్నారు. పోడు పట్టాలు సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని పొంగులేటి స్పష్టం చేశారు. జ్యోతిరావు ఫూలే స్ఫూర్తితో విద్యనందించేలా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు.

సమాజానికి వ్యవసాయం కీలకం

సింగూరు ను టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతాం
-జోగిపేట్ డివిజన్ ఆత్మ కమిటీ ప్రమాణస్వీకారంలో
-మంత్రి దామోదర్ రాజనర్సింహ .

సంగారెడ్డి ఏప్రిల్ 10(నేటి నిజం ప్రతినిది)జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారానికి వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ అండ్

టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరైనారు.

ఆత్మ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డి గారి మల్లారెడ్డి,ఆత్మ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం ఆత్మ కమిటీ చైర్మన్, సభ్యులను పుల మాలలు వేసి, శాలువాతో సత్కరించరూ.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం సమాజానికి కీలకం అన్నారు. రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయం దండగా కాదు పండగ అని పేర్కొన్నారు.గత ప్రభుత్వం లో సింగూరు ప్రాజెక్ట్ నిర్మించి సంగరెడ్డి జిల్లా ను శ్యాస్య శామలం చేశామన్నారు. సింగూరు కాలువలు కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని వాటిని 170కోట్లతో శాశ్వత పనులు చేసి పూర్తి చేస్తామన్నారు. నియోజక వర్గాల్లో ఎక్కడ అవసరం ఉందో అక్కడ పిహెచ్ సి,అంబులెన్స్,పోలీస్ స్టేషన్, కేజీవిబి,అందోల్ కు నర్సింగ్ కాలేజ్,ట్రామా సెంటర్,30పడకల హాస్పిటల్ తీసుకొస్తామన్నారు.

సింగూరు ను ఆహ్లాదంగా టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతాం అన్నారు.

ఆత్మ కమిటీలు వ్యవసాయం లో సాంకేతిక పద్ధతులు అనుసరించాలని ,నూతన వ్యవసాయ అవలంబిస్తున్న ప్రదేశాలు రైతులు సందర్శించి ,అమలు చేయాలన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆత్మ కమిటీ పూర్తి చేస్తామన్నారు.

ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ ఏది రైతు ప్రభుత్వం అని , రైతులకు ఏక కాలంలో రుణ మాఫీ చేసిన ప్రభుత్వం అని అన్నారు.

అనంతరం జోగినాథ ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బిజెపి ప్రభుత్వంపై 40 శాతం కమిషన్ ఆరోపణపై సిట్ దర్యాప్తు

-కర్నాటక మంత్రివర్గ నిర్ణయం
-రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదిక

బెంగళూరు ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : జస్టిస్ నాగమోహన్ దాస్ కమిషన్ దర్యాప్తు నివేదిక నేపథ్యంలో కర్నాటకలో పూర్వపు బిజెపి ప్రభుత్వంపై వచ్చిన 40 శాతం కమిషన్ ఆరోపణలపై దర్యాప్తు నిమిత్తం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం నిర్ణయించింది. సిట్ రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని కర్నాటక న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కె పాటిల్ విలేకరులతో చెప్పారు. ఆ తరువాత దర్యాప్తు నివేదికను మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెడతారు. మూడు లక్షల పనుల్లో సమూనాగా 1729 పనులపై జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిషన్ దర్యాప్తు నిర్వహించిందని మంత్రి వెల్లడించారు. 'ఆ నివేదిక రెండు సంపుటాల్లో ఉంది. అది అవకతవకల ఆరోపణలను ధ్రువీకరించింది' అని మంత్రి తెలియజేశారు. విడుదల చేసిన డబ్బు మంజూరు చేసిన మొత్తం కంటె ఎక్కువ అని, నిరభ్యంతర పత్రాన్ని ముందుగానే జారీ చేశారని, టెండర్ ప్రక్రియలో జోక్యం ఉందని పాటిల్ ఆరోపించారు. 'సిట్‌లో క్షేత్రం నుంచి నిపుణులు ఉంటారు. సిట్ రెండు నెలల్లో తన నివేదిక సమర్పించవలసి ఉంది. జస్టిస్ నాగమోహన్ దాస్ చేపట్టిన 1729 శాంపిళ్లనే కాకుండా మొత్తం పనులపై దర్యాప్తు జరుపుతుంది' అని మంత్రి వివరించారు.

కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ. 8,01,105

మెదక్, ఏప్రిల్ 11 : మండలంలోని తీగుల్ నర్సాపూర్ ప్రసిద్ధ కొండపోచమ్మ దేవాలయ హుండీని దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు వివిధ కానుకలను హుండీలో వేసి ముడుపులు చెల్లించుకున్నారు. 59 రోజులకు గాను హుండీ లెక్కింపు చేపట్టగా హుండీ ఆదాయం రూ. 8,01,105 వచ్చినట్లు సిద్దిపేట దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఈవో రవికువార్ తెలిపారు. అమ్మవారికి హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని అమ్మవారి బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆలయ అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత రమేశ్, ధర్మకర్తలు చెక్కల నరేశ్, సిబ్బంది మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కనకయ్య, హరిబాబు, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

మహాత్మాఫూలే, సావిత్రిబాయి ఫూలేల జీవితాన్ని పాఠ్యాంశంగా పెట్టాలి

-కత్తిపద్మారావు



హైదరాబాద్, ఏప్రిల్ 11: ఈ రోజు మహత్మ ఫూలే జన్మదినం సందర్భంగా లుంబినివనం, అంబేద్కర్ రిసెర్చ్ సెంటర్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా ఫూలే సావిత్రి భాయి ఫూలే జీవిత చరిత్రల రచయిత మహాకవి డాడ కత్తి పద్మారావు గారు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మహాత్మాఫూలే, సావిత్రిబాయి ఫూలేలు 19వ శతాబ్దంలో ఆవిర్భవించిన విద్యా విప్లవ జ్యోతులని వారు మొదటి దళిత విద్యా ఉపాధ్యాయులని, స్త్రీ విద్యకు మొదటి పాఠశాలను నిర్మించిన జాతి వైతాళికులని కొనియాడారు. వీరిరువురు ఆదర్శ దంపతులని ఆత్మగౌరవ పతాకాలని కొనియాడారు. ప్రతి మండలంలో మహాత్మాఫూలే, సావిత్రిబాయి ఫూలేల విగ్రహాలు, లైబ్రరీలు నిర్మించాలని, వారి జీవిత చరిత్రలను పాఠ్యగ్రంథాలుగా పెట్టాలని డిమాండ్ చేశారు. దళిత మహాసభ కోశాధికారి వేము మాధవ్ గారు మాట్లాడుతూ మా పదినమ్మ కూడా సావిత్రిభాయి ఫూలేల ఎందరికో విద్యాదానం చేసి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న గొప్ప వ్యక్తి అన్నారు. కత్తి పద్మారావు వదినమ్మ స్వర్ణ కుమారి గారల కృషి, పోరాటం చూసినపుడు మహాత్మాఫూలే, సావిత్రిబాయి ఫూలేల జీవితం గుర్తుకొస్తుందని అన్నారు. ఈ సందర్భంగా లుంబినివనంలో ప్రతిష్టాపించిన మహాత్మా ఫూలే, సావిత్రిబాయి ఫూలేల విగ్రహాలకు మాతా రమాబాయి అవార్డు గ్రహీత శ్రీమతి కత్తి స్వర్ణ కుమారి గారు పుష్పమాల అలంకృతులు చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ కుమారి గారు మాట్లాడుతూ మహాత్మా ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతులు ఈనాటి సమాజానికి ఆదర్శమని వారొక వ్యక్తులుగా గాక వ్యవస్థలుగా జీవించారని ఆమె అన్నారు.

ఈ సమావేశంలో గేరా ప్రసన్న కుమారి ఎం.ఏ.,ఎం.ఎడ్., గారు, దాసరి శ్యామల గారు, జొన్నలగడ్డ రాణి బి.కాం గారు పాల్గొన్నారు.

ఆహ్వానం

రామదాసు సాహితీ కళా సేవా సంస్థ

(సుద్దపల్లి, నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా) రి.నెం. 435/2024

ద్వితీయ వార్షికోత్సవం

తేది : 13.04.2025 ఆదివారం ఉ॥ 9 గంటల నుండి మ॥ 1 గంట వరకు
వేదిక : కళా సంగీత నాట్య వేదిక, త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్.

విశిష్ట అతిథి :
శ్రీ తేజావత్ రామదాసు గారు, Addl. DCP Traffic, Hyderabad City

సభాధ్యక్షులు :
శ్రీ రామకృష్ణ చంద్రమౌళి గారు
ప్రముఖ కవి, విశ్లేషకులు, ఆధ్యాత్మికవేత్త

ముఖ్య అతిథులు :
డా. వి.డి. రాజగోపాల్ గారు
విశ్రాంత డైరెక్టర్ ఆఫ్ మైన్స్ మహబూబ్ నగర్ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు

శ్రీ గంటా మనోహర్ రెడ్డి గారు
ప్రముఖ కవి, విశ్లేషకులు, ఆధ్యాత్మికవేత్త

శ్రీమతి డా. రాధ కుసుమ గారు
ప్రముఖ కవయిత్రి, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షులు

ప్రత్యేక అతిథులు :
శ్రీ భీమా శ్రీనివాసరావు గారు, ప్రముఖ కవి, రచయిత, ఆధ్యాత్మిక జిజ్ఞాసి
శ్రీ ఎం.వి. చంద్రశేఖరరావు గారు, ప్రముఖ కవి, విశ్రాంత రైల్వే ఆఫీసర్
డా. రవీంద్రబాబు అరవా గారు, ప్రముఖ కవి, గాయకులు
శ్రీ జె.వి. కుమార్ చేపూరి గారు, ప్రముఖ కవి, విశ్లేషకులు
డా. మోటూరి నారాయణరావు గారు, ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్
శ్రీ గూండ్ల నారాయణ గారు, ప్రముఖ కవి, రచయిత, BSNL విశ్రాంత ఆఫీసర్

సాత్వికాహార విందు భోజనం మధ్యాహ్నం 1 గంటకు.

ఆహ్వానించువార

భక్తి సులభుడు, దైవిక శక్తి స్వరూపుడు మన హనుమంతుడు

(12 ఏప్రిల్ "హనుమాన్ జయంతి" సందర్భంగా)

హిందువుల హృదయాంతరంగాల్లో వానర దేవుడుగా, సంకట మోచనుడిగా వీర భక్త హనుమ సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. చైత్రమాసంలో శుక్లపక్షం పూర్ణిమ తిథి రోజున, అనగా 12 ఏప్రిల్ 2025న "హనుమాన్ జయంతి"ని భక్తకోటి అత్యంత ఉత్సాహం, ఉల్లాసం, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అనాదిగా ఆధ్యాత్మిక సాంప్రదాయంగా మారింది. రామ నవమి రోజున శ్రీరాముడు జన్మించిన కొద్ది రోజులకు హనుమాన్ జన్మించడం ఓ అద్భుత సందర్భం. శివుడి రుద్ర అవతారంగా మారుతిని పరిగణిస్తారు. మాతా అంజలి, వనరాజు కేసరి దంపతులకు సూర్యోదయా సమయాన జన్మించిన సంకట మోచనుడికి అనేక ప్రియమైన పేర్లు ఉన్నాయి. అంజని పుత్రుడు, మారుతి నందనుడు, భజరంగ్‌బలి, సంకట మోచనుడు, ఆంజనేయుడు, పవన సుతుడు, హనుమంతుడు లాంటి పలు నామాలతో భక్తులు నోరారా పిలుచుకుంటూ పుణీతులు కావడం చూస్తున్నాం.

రెండు పర్యాయాలు హనుమన్ జయంతి వేడుకలు:

హిందు శాస్త్రాల ప్రకారం హనుమంతుడు నేటికీ మన మధ్య ఉంటూ భక్తుల కోర్కెలను తీర్చుతూ, సర్వాంతర్యామిగా సంచరిస్తూనే ఉన్నాడని పేర్కొనబడింది. ఏడాదికి రెండు పర్యాయాలు చిన్న, పెద్ద హనుమాన్ జయంతులను నిర్వహించుకోవడం చూస్తున్నాం. హనుమ జన్మదినాన్ని పురస్కరించుకొని చైత్రమాస శుక్లపక్షంలో పూర్ణిమ రోజున (12 ఏప్రిల్ 2025) ఒక హనుమాన్ జయంతిని, మార్గశిరా అమావాస్య రోజున (25 డిసెంబర్ 2025)న రాక్షస రాజు రావణుడిపై శ్రీరాముడి విజయంగా "హనుమ విజయం" పేరున 2వ హనుమ జయంతిని నిర్వహించుకుంటున్నాం. హనుమాన్ జయంతిని వేరు వేరు రాష్ట్రాలు వేరు వేరు తేదీల్లో జరుపుకోవడం జరుగుతున్నదని తెలుసుకోవాలి.

హనుమన్ జయంతి వేడుకలు:

హనుమాన్ జయంతి రోజున వేకువ జామున నిద్రలేసి స్నానాలు చేసి, నూతన ఎరుపు రంగు వస్త్రాలు ధరించి హనుమాన్ లేదా సీతారాముల దేవాలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకొని పూజలు నిర్వహించడం తరుచుగా కనిపిస్తుంది. హనుమన్ కీర్తిని ప్రస్తుచించడానికి మనసారా కీర్తనలు, ఉపవాస దీక్షలు, రామాయణ పఠనాలు, దాతృత్వ సేవలు, భజనలు, హనుమ విగ్రహ ర్యాలీలు, సుందరకాండ పఠనాలు, లడ్డు/బోధది/అప్పాల ప్రసాద వితరణలు, వ్రతాలు చేయడం, హనుమ విగ్రహాలకు చందన అలంకరణలు, పేదలకు/భక్తులకు అన్న ప్రసాద వితరణలు, ధ్యానాలు, ధూపదీప నైవేద్యాల సమర్పణలు, అభిషేకాలు, ఆరతి ఇవ్వడం, పూలు/పండ్ల/తాంబూల సమర్పణలు, మంత్రోచ్చరణలు, దానధర్మాలు లాంటి పూజలను భక్తకోటి భక్తిప్రపత్తులతో నిర్వహిస్తారు.

41-రోజుల హనుమన్ దీక్షలు :

తెలుగు రాష్ట్రాల్లో 41 - రోజుల పాటు చైత్ర పూర్ణిమ నుంచి వైశాఖ శుక్లపక్ష 10వ రోజు వరకు లేదా చైత్ర పూర్ణిమ నుంచి 41వ రోజు హనుమాన్ జయంతి వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో బ్రహ్మచర్యం పాటిస్తూ, కఠోర నియమనిబంధనలు, దురలవాట్లకు నిషేధం విధించుకొని భక్తిభావంతో నిర్వహిస్తారు. హనుమాన్ చాలీసా పారాయణంతో దుష్టశక్తులు తొలగి శాంతి, శ్రేయస్సులు లభిస్తాయనా ప్రగాఢంగా విశ్వసిస్తారు. సీతారాముల అత్యంత ప్రియమైన భక్తుడిగా హనుమకు పేరు ఉంది.

భక్తి, దైవిక శక్తి స్వరూపుడైన హనుమంతుడిని నిజాయితీగా సేవించడం ద్వారా భక్తులు శ్రేయస్సు, దీర్ఘాయువు, ధుష్ప్రభావాల నుంచి ఉపశమనం కలుగుతాయి. హనుమాన్ సేవ చేయడం ఫలితంగా మనో బలం, సంపూర్ణ ఆరోగ్యం, శత్రువుల నుంచి రక్షణ, అడ్డంకుల నుంచి విముక్తి ప్రసాదించబడతాయి. జీవితాల్లో కష్టనష్టాల దుఃఖాలను తొలగించే హనుమాన్ జయంతి శుభ గడియల్లో మనసారా చిరంజీవి పవనపుత్రుడిని మనసారా ఆరాదిద్దాం, వారి ఆశీస్సుల దీవెనలను పొందే అర్హత సాధిద్దాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

బొగ్గు గని కార్మికులే నిజమైన ఇంధన యోధులు

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:ఛత్తీస్‌గఢ్‌లోని సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్)కు చెందిన గెవ్రా గనులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ఈ రోజు సందర్శించారు. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద బొగ్గు గనిగా పేరు గాంచిన గెవ్రా, వృద్ధి చెందుతున్న భారత ఇంధన శక్తికి చిహ్నంగా నిలుస్తుంది. క్షేత్రస్థాయిలో పని చేసే కార్మికుల పట్ల, బొగ్గు రంగంలో ఉత్పాదకత, సంక్షేమాన్ని మెరుగుపరచడంలో ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని మంత్రి పర్యటన తెలియజేస్తోంది.

గెవ్రా హౌస్ వద్ద సీఐఎస్ఎఫ్ బలగాల గౌరవ వందనాన్ని కేంద్రమంత్రి స్వీకరించారు. గని వ్యూ పాయింట్ వద్ద ఎస్ఈసీఎల్ సాధించిన విజయాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనుల గురించి మంత్రికి అధికారులు వివరణాత్మక ప్రదర్శన ఇచ్చారు. దేశ ఇంధన వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన బొగ్గు రంగంలో నిరంతరాయంగా సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తున్న మహిళా కార్మికులతో సహా గని కార్మికులను శ్రీ కిషన్ రెడ్డి సత్కరించారు.

గని లోపలికి వెళ్లిన మంత్రి, అక్కడ భారీ స్థాయిలో జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. అంతర్జాతీయంగా వినియోగించే హెవీ ఎర్త్ మూవింగ్ మెషీన్ (హెచ్ఈఎంఎం)లైన తవ్వకానికి వినియోగించే 42 క్యూబిక్ మీటర్ల యంత్రం, 240 టన్నుల డంపర్ లాంటి భారీ యంత్రాల పనితీరును పరిశీలించారు. అలాగే పేలుడు రహిత ఉపరితల మైనింగ్ సాంకేతికత వినియోగాన్ని సమీక్షించారు. సుస్థిరమైన, పర్యావరణ హిత బొగ్గు తరలింపే లక్ష్యంగా, ఫస్ట్ మైల్ కనెక్టివిటీ (ఎఫ్ఎంసీ) కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన ఆధునిక బొగ్గు నిల్వ వ్యవస్థ (సైలో)లను సందర్శించారు.

మెషీన్ ఆపరేటర్లతో వారి క్యాబిన్లలో ముచ్చటించిన శ్రీ కిషన్ రెడ్డి, బొగ్గు ఉత్పత్తిలో వారు అందిస్తున్న ప్రధాన సహకారాన్ని ప్రశంసించారు. ఈ చర్య ఆపరేటర్లలో స్థైర్యాన్ని నింపింది. క్యాంటీన్లో కార్మికులతో కలసి భోజనం చేసిన మంత్రి, వారితో సెల్ఫీలు దిగారు. ఇది కార్మికులను ఆకట్టుకుంది.

ఈ పర్యటనలో భాగంగా ఎస్ఈసీఎల్ అమలు చేస్తున్న హరిత కార్యక్రమాలను సైతం పరిశీలించారు. జపాన్ అటవీకరణ పద్ధతి మియావాకీ ఉపయోగించి ప్రయోగాత్మక పద్ధతిలో చెట్లను పెంచుతున్న స్థలాన్ని సందర్శించారు. అలాగే ఉద్యోగులకు సంబంధించిన కార్యక్రమాలు, సామాజిక సమావేశాలు తదితరమైనవి నిర్వహించడానికి వీలుగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర మంత్రి దేశాభివృద్ధిలో బొగ్గు పోషిస్తున్న కీలక పాత్ర గురించి వివరించారు. దేశంలో విద్యుదుత్పత్తి 70 శాతం కంటే ఎక్కువే బొగ్గుపై ఆధారపడి ఉందని వెల్లడించారు. సుస్థిరతతో కూడిన సమతౌల్యాభివృద్ధి, బాధ్యతాయుతమైన గనుల మూసివేత పద్ధతులను వేగవంతం చేయడం, పర్యావరణ ప్రమాణాలను నిరంతరం మెరుగుపరచాల్సిన అవసరాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. గెవ్రా దేశానికే గర్వకారణమన్న ఆయన.. ''ఆహారం కోసం ఎవరూ ఎదురుచూడకూడదు. విద్యుత్ సరఫరా ఆలస్యం కాకూడదు. దేశం ప్రకాశవంతంగా, శక్తిమంతంగా ఉండేలా గని కార్మికులు భరోసా ఇస్తున్నారు" అని తెలిపారు.

నవకార్ మహామంత్ర దివస్ పేరిట మహావీర్ జయంతి వేడుకలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:"భారతదేశ మేధో వైభవానికి జైన సాహిత్యం వెన్నెముక వంటిది. ఈ సంపద పరిరక్షణ మా బాధ్యత" ? ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ

ఆధ్యాత్మిక, శాంతి సామరస్య భావనలకు ప్రతీకగా జైన మత 24వ తీర్థంకరుడు మహావీర జైనుడి జయంతిని భారతదేశం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటోంది. ఈ సందర్భంగా కరుణ, సంయమనం, నిజాయితీలకు జీవితాన్ని అంకితం చేసిన ఆ పుణ్యమూర్తికి ప్రజలు హృదయపూర్వక నివాళులర్పిస్తున్నారు. యుద్ధాలు సంఘర్షణలతో సతమతమవుతున్న మానవాళికి, కాలానికి అతీతమైన మహావీరుని సత్యాహింసల, జాగురూకతల సందేశాలు ఊరటనిస్తూ సామరస్యం, ఎరుకతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవలసిన ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి.

ఏప్రిల్ 9న ప్రధానమంత్రి ప్రారంభించిన నవకార్ మహామంత్ర దివస్ ద్వారా ఈ ఏటి మహావీర్ జయంతి పర్వదినానికి మరింత ఆధ్యాత్మిక పరిపూర్ణత చేకూరింది.

"నవకార్ మహామంత్రం కేవలం ఒక మంత్రం కాదు, మన విశ్వాసాలకి కేంద్ర బిందువు, జీవన సారానికి ప్రతిబింబం: ప్రధానమంత్రి"

జైన ధర్మంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన నవకార్ మంత్రం కేవలం పవిత్రమైన పంక్తుల అమరిక మాత్రమే కాదు... ఒక లయలో ఒదిగి దివ్యమైన శక్తిని, స్థిరచిత్తతను, వెలుగును ప్రసారం చేసే అద్భుత సాధనం.

గుజరాత్ లో జన్మించిన తనకు బాల్యంలోనే లభించిన జైన ఆచార్యుల సాంగత్యం, ధర్మం పట్ల అవగాహన పెంపొందటంలో సాయపడిందని ప్రధానమంత్రి అన్నారు. జైన ధర్మం చరిత్రకు పరిమితమైన అంశం మాత్రమే కాదని, తన మూలాలను మరిచిపోకుండా వృద్ధి చెందాలని ఆశిస్తున్న నేటి భారతావనికి దారి దీపమని ప్రధాని స్వీయ అనుభవం తెలియజేసింది.

భగవాన్ మహావీర్ ఆదర్శాల విస్తృత ప్రభావాన్ని మహావీర్ జయంతి సందర్భంగా స్మరించుకొన్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:మహావీర్ జయంతి ఈ రోజు. కలకాలం ప్రేరణాత్మకంగా నిలిచే భగవాన్ మహావీర్ బోధనలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ సందర్భంగా గుర్తు తెచ్చుకొన్నారు. ఆయన ప్రబోధాలు తన జీవనాన్ని కూడా విస్తారంగా ప్రభావితం చేశాయని ప్రధాని అన్నారు.

మోదీ ఆర్కైవ్ 'ఎక్స్'లో పొందుపరచిన ఒక సందేశం, భగవాన్ మహావీర్ ప్రబోధాలతోనూ, జైన సముదాయంతోనూ ప్రధానికి చాలాకాలంగా ఉన్న ఆధ్యాత్మిక బంధానికి అద్దంపట్టింది.

మోదీ ఆర్కైవ్ 'ఎక్స్'లో పొందుపరచిన సందేశానికి ప్రధాని ప్రతిస్పందిస్తూ:

"భగవాన్ మహావీర్ ఆదర్శాలు నాతో సహా అసంఖ్యాక ప్రజలకు ఎంతో ప్రేరణనందిస్తున్నాయి. ఆయన ఆలోచనలు శాంతియుత, కరుణాభరిత ధరణిని ఆవిష్కరించగలిగే మార్గాన్ని చూపుతున్నాయి" అని పేర్కొన్నారు.

సాంఘిక సమానత్వ సాధనే మహాత్మా ఫూలేకు నిజమైన నివాళి: సింగరేణి సీఎండీ బలరామ్

హైదరాబాద్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావ్ ఫూలే మహిళా విద్య కోసం, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం, సకలజనుల సామాజిక న్యాయం కోసం పోరాడారని, సమాజంలో సాంఘిక సమానత్వం సాధించి చూపటమే మహాత్మ జ్యోతిరావ్ ఫూలేకి నిజమైన నివాళి అవుతుందని సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన మహాత్మా జ్యోతిరావ్ ఫూలే జయంతి ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా మహాత్మ జ్యోతిరావ్ ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ప్రసంగిస్తూ 150 సంవత్సరాలకు పూర్వమే శ్రీ జ్యోతిరావ్ ఫూలే అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని, మహిళల విద్య కోసం అవిశ్రాంతంగా శ్రమించారని, అణిచివేత చర్యలకు వ్యతిరేకంగా దళితుల తరఫున పోరాడారని వివరించారు. తన భార్య సావిత్రి ఫూలేకి స్వయంగా విద్య నేర్పి, మహిళ ఉద్యమానికి నాయకత్వం వహించేలా చేశారని, ఆయన గొప్ప నిస్వార్థ సంఘ సంస్కర్త, మానవతావాది అని ప్రశంసించారు. సనాతన మూఢాచారాలకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమాలు నడిపారని, అన్ని జాతుల, కులాల వారికి సాంఘిక, ఆర్థిక సమానత్వం కోసం తన జీవితాన్ని ధారపోసారని, ఆయన మహోన్నత సిద్ధాంతాలు మనకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

సభా కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవెంట్) ఎస్.డి.ఎం.సుభాని అధ్యక్షత వహించి మాట్లాడారు. బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధిగా డీ.జీ.ఎం చౌటపల్లి ప్రభాకర్ తదితరులు ప్రసంగించారు. సింగరేణి భవన్ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్ : కష్టాల కడలిలో కలల సౌధం

-అమెరికాలో మనోళ్ల జీవనం ఆగమాగం
-చిన్న నేరం చేసినా తీవ్రమైన చర్యలు
-సోషల్ మీడియా పోస్టులపైనా కఠిన ఆంక్షలు
-వ్యతిరేక పోస్టులు పెడితే జాబ్స్ పోవడం ఖాయం
-అమెరికా కాదిది.. జైలు అంటున్న విదేశీయులు
-స్వదేశానికి రాలేక.. అక్కడే ఉండలేక పాట్లు
-ట్రంప్ దెబ్బకు వణకిపోతున్న ఇండియన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:అమెరికా అంటే మహాద్భుతం.. మన ఊరి నుంచి ఎవరైనా అమెరికా వెళుతున్నారంటే చాలు, వీధి చివర టీకొట్టు దగ్గర నుంచి.. పచ్చని పొలాలు దాటి ఊరి చివర దాకా ఒకటే ముచ్చట. పలానా వాళ్లబ్బాయి అమెరికా పోయిండని కథలు, కథలుగా చెప్పుకునేవారు. ఇక.. వాళ్ల కాలాం మారింది . జనం ఎక్కువైతే మజ్జిగ పల్చన అయినట్టు, అమెరికాకు మనోళ్లు క్యూ కట్టడంతో సీన్ రివర్స్ అయ్యింది. అక్కడ ఏం జరుగుతుందో కళ్లారా చూస్తున్నాం కాబట్టి అమెరికా అంటే ఇప్పుడు ఉలిక్కిపడే రోజులు వచ్చాయి. ఇప్పుడసలు కథ వేరే ఉంది.

అమెరికా ఇప్పుడు కళ్లు

స్వదేశానికి తిరిగివస్తే దేవుడు దిగివచ్చినట్టు, లేకపోతే అంతరిక్షం నుంచి ఊడిపడ్డ గ్రహాంతరవాసిలాగా చూసేవాళ్లు. షర్టు మీద కోటు వేసుకొని సూటు బూటుతో దిగితే చాలు.. ఊరంతా ఊరేగింపు తీసేవాళ్లు.. అమెరికా అంటే అంత గొప్పగా ఉండేది ఒకప్పుడు.. కానీ అమెరికాలోనూ వ్యవహరిస్తే.. అంతే సంగతి. వెంటనే పట్టుకొని వెనక్కి పంపిస్తున్నారు. ఇక్కడ తెరిచింది. ఇన్నాళ్లూ ఊరుకుంది కానీ, ఇప్పుడు అసలు రూపం చూపిస్తోంది. మన దేశంలో ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేసినట్టు, సిగ్నల్ జంప్ చేసినట్టు, ఎక్కడ పడితే అక్కడ బండ్లు పార్కింగ్ చేసినట్టు అమెరికాలోనూ ఎవరినైనా ఏమైనా మాట్లాడొచ్చు, దేశద్రోహులను కూడా వెనకేసుకొస్తారు. కానీ, అమెరికాలో అట్లా కాదు. అక్కడ దేశభక్తి అంటే దేశభక్తే దేశాన్ని వ్యతిరేకిస్తే ట్రంప్ లాంటి వాళ్లు కేసులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. దేశం విడిచి వెళ్లాలనా ఆదేశాలు జారీ చేస్తున్నారు.

సోషల్ మీడియా పిచ్చిలో పడి, తెలిసీ తెలియక మనోళ్లు ఏదేదో పోస్టులు పెడుతున్నారు. పాలస్తీనాకు సపోర్ట్ చేస్తూనో.. ఇజ్రాయెల్‌ని తిడుతూనో ఏదో ఒకటి రాసేస్తుంటారు. అమెరికాలో అట్లా కాదు.. ఇలాంటివి జరిగితే అంతే, అకౌంట్లోకి మెరుపులా ఒక మెయిల్ వస్తుంది. అసలు విషయం ఏంటని ఆరా తీస్తే.. నువ్వు రూల్స్ బ్రేక్ చేశావని, సిస్టమ్‌ని ధిక్కరించావని చెబుతారు. ఏం తప్పు చేశామని అమాయకంగా మొహం పెడితే.. నీ సోషల్ మీడియా పోస్టులే నీ కొంప ముంచాయని లెక్క తేల్చేస్తారు.

ఏ చిన్న తప్పు చేసినా కేసు నమోదు అవుతుంది. దాన్నుంచి బయటపడాలంటే కోర్టుల చుట్టూ తిరగాలి.. లీగల్ ఫైట్లు చేయాలి. ఇంకోపక్క ఉద్యోగాలు ఊడిపోతాయి. భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుంది. అమెరికా వెళ్లడం ఒకప్పుడు కల.. కానీ, ఇప్పుడు అమెరికా వెళ్లడమే నరకంలా మారుతోంది. అక్కడున్న వాళ్లకు అమెరికా జైలే.. ఇల్లు, ఆఫీస్ తప్ప మరో చోటికి వెళ్లాలంటే తనిఖీల భయం పట్టుకుంది.. ఏ కేసు పెడతారేమోనని చాలామందిలో ఆందోళన ఉంది. వీకెండ్ పార్టీలు బంద్.. పబ్‌లలో విందులకు దూరం.. మాస్ గేదర్ మీటింగ్‌లకు గుడ్ బై చెప్పేస్తున్నారు.

ఇల్లే కదా స్వర్గ సీమ అంటూ అక్కడవాళ్లు ఇంటిలోనే పాటలు పాడుకుంటున్నారు.. కారు బయటకు తీస్తే ఏ కేసు పడుతుందలోనేని భయంతో కాల్ టాక్సీలలో ప్రయాణిస్తున్నారు. ఆఫీసులకు దర్జాగా కారులో వెళ్లే మన టెక్ బాబులు, టెక్ అమ్మాయిలు ఎంచక్కా ఆఫీస్ బస్సులోనే వెళుతున్నారు. లేదంటే పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ సేవలనే వినియోగించుకుంటున్నారు.. ట్రంప్ దెబ్బకు చాలామంది తెలుగువారు మారిపోయారు.. జైలు కాని జైల్లో ఉంటున్నామని ఫోన్ చేసి ఘొల్లుమంటున్నారు. ఎఫ్1, బి 1, బి 2 వీసాలున్నా తప్పు చేస్తే ఇంటికి పంపేస్తారనే భయం అందరిలోనూ ఉంది. ట్రంప్ వార్నింగ్‌లతో గజగజ వణికిపోతున్నారు. ట్రంప్ ఉన్నాడు.. కాస్త జాగ్రత్తగా ఉండండి. డాలర్ డ్రీమ్స్ మోజులో కళ్లు మూసుకొని వెళ్లే రోజులు పోయాయి. ఇప్పుడు ప్రతి అడుగు వెయ్యి కళ్లతో ఆలోచించి వేయాల్సిన టైం ఇది అంటూ అక్కడున్న వాళ్లు హిత బోధ చేస్తున్నారు.

ప్రజల దృష్టిని మరల్చడానికే హైడ్రా, హెచ్‌సియు డ్రామాలు: ఎంపి ధర్మపురి అరవింద్

హైదరాబాద్ ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: రేవంత్ రెడ్డి సర్కారుపై నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ మరోసారి విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్రంలో అవినీతి, అసమర్థ ప్రభుత్వ పాలన నడుస్తోందని ఆయన అన్నారు. ఇచ్చి ఏ ఒక్క హామీని కాంగ్రెస్ సర్కారు పూర్తి చేయలేదని.. సిఎం రేవంత్ సిసిపియూ(కనెక్ట్, కలెక్ట్, పే, యూజ్) కోర్సు పూర్తి చేశారని ఎద్దేవా చేశారు. లక్షల కోట్ల అప్పు ఉందని తెలిసి కాంగ్రెస్ ఇన్ని వాగ్దానాలు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు.రాష్ట్రంలో పరిపాలన శూన్యమని.. దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే హైడ్రా, హెచ్‌సియు డ్రామాలు అని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో పెద్దల నుంచి అంగన్వాడిలో చదువుకొనే పిల్లల వరకూ ఎవరూ సంతోషంగా లేరని పేర్కొన్నారు. కెసిఆర్ గజదొంగ గంగన్న అయితే.. రేవంత్ ఆయన కొడుకు రంగన్నలా తయారయ్యారని అన్నారు.



గోవుల మరణం అవాస్తవం.. ప్రకటించిన టిటిడి

తిరుపతి, ఏప్రిల్ 11: టిటిడి గోశాలలో ఇటీవల గోవులు మృతి చెందాయంటూ కొద్దిమంది సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని టిటిడి అధికారులు ప్రకటించారు. మృతి చెందిన గోవులు పోటోలు టిటిడి గోశాలకు సంబంధించినవి కావని అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.దురుద్దేశంతో కొద్ది మంది మృతి చెందిన గోవులు పోటోలను టిటిడి గోశాలలో మృతి చెందినవిగా చూపించి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.. ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నామని, ఇలాంటి అవాస్తవ ప్రచారాన్ని నమ్మవద్దని టిటిడి అధికారులు భక్తులను కోరారు.

పద్మ పురస్కారాలు-2026 నామినేషన్ల సమర్పణకు ఈ సంవత్సరం జూలై 31 వరకు గడువు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రకటించే 'పద్మ పురస్కారాలు?2026'కు నామినేషన్లు, సిఫారసులను స్వీకరించడాన్ని 2025 మార్చి 15న ప్రారంభించారు. నామినేషన్లను సమర్పించడానికి చివరి తేదీ 2025 జూలై 31. పద్మ పురస్కారాలకు నామినేషన్లను, సిఫారసులను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ (స్థబిబిజూబ:// జీలిజీతీటబ.ణనీల.తిని) లో ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తారు.

పద్మ పురస్కారాలు.. అంటే పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీ.. ఇవి దేశంలో అన్నింటికన్నా ఉన్నతమైన పౌర పురస్కారాలు. 1954లో ఏర్పాటు చేసిన ఈ పురస్కారాలను ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తారు. ఈ పురస్కారాల్లో భాగంగా 'విశిష్ట కృషి'ని గుర్తిస్తారు. పద్మ పురస్కారాలను కళ, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు (పబ్లిక్ అఫైర్స్), సివిల్ సర్వీస్, వాణిజ్యం, పరిశ్రమ వంటి అన్ని రంగాల్లో విశిష్ట, అసాధారణ విజయాలకు, సేవకుగాను అందజేస్తుంటారు. జాతి, వృత్తి, పదవి, పురుషుడు, మహిళ అనే భేద భావానికి తావీయకుండా అందరు వ్యక్తులు ఈ పురస్కారాలకు అర్హులు. వైద్యులు, శాస్త్రవేత్తలు తప్ప... ఇతర ప్రభుత్వోద్యోగులు, పీఎస్‌యూలలో పనిచేసే ప్రభుత్వోద్యోగులు పద్మ పురస్కారాలకు అర్హులు కారు.

పద్మ అవార్డులను "పీపుల్స్ పద్మ" (ప్రజల పద్మ) పురస్కారాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ కారణంగా, పౌరులంతా నామినేషన్ చేయవచ్చు, సిఫారసు చేయవచ్చు. పౌరులు తమను తాము నామినేట్ చేయడానికీ అవకాశం ఉంది. మహిళలు, సమాజంలో బలహీన వర్గాల వారు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, దివ్యాంగజనులు, సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న వారిలో శ్రేష్ఠత్వం, విజయాల ఆధారంగా సిసలైన గుర్తింపునకు నోచుకోగలిగే ప్రతిభావంతులను గుర్తించేందుకు ఉమ్మడి ప్రయత్నాలు చేయవచ్చు.

పైన తెలిపిన పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఫార్మెట్‌లో నిర్దిష్టమైన, సందర్భశుద్ధి కలిగిన వివరాలన్నీ నామినేషన్లు, సిఫారసులలో పేర్కొనాలి. ఒక వర్ణనాత్మక సైటేషన్‌ను (ఇది 800 పదాలను మించకూడదు) కూడా జోడించాలి. ఇది సిఫారసు చేస్తున్న వ్యక్తికి ఆ వ్యక్తికి సంబంధించిన రంగంలో గాని, డిసిప్లిన్‌లో గాని సాధించిన విశిష్ట, అసాధారణ విజయాలు, అందించిన సేవలను గురించిన స్పష్టమైన సమాచారాన్ని జతపరచాలి.

ఇది బిసి పార్టీ.. వారి అభివృద్ధికి మరిన్ని నిధులిస్తాం - చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 11: ఈ ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. అమరావతిలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి సివిల్స్‌కు శిక్షణ ఇస్తామని మాటిచ్చారు. ప్రతీ ఏడాది రూ.1000 కోట్లతో ఆదరణ పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

ఏలూరు జిల్లాలోని అగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలో నేడు చంద్రబాబు పర్యటించారు. ముందుగా ఆయన సామాజిక సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు గోవిందరావు పూలే జయంతి వేడుకలలో పాల్గొన్నారు.. పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.. పి 4 లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు.. అక్కడ ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు.. అక్కడే ఉన్న ట్రాక్టర్ చంద్రబాబు స్వయంగా నడిపారు.

అనంతరం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చంద్రబాబు లాంచనంగా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తూ, సామాజిక సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు గోవిందరావు పూలే జయంతి చేసుకోవడం ఒక చరిత్ర అని అభివర్ణించారు. ఆయన జయంతిని వాడవాడలా చేస్తున్నామంటే, ఆయన స్ఫూర్తి ఎంతో తెలుస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కుల కోసం జ్యోతిరావు పూలే పోరాడారని ఉద్ఘాటించారు. మన రాష్ట్రంలో మహిళల చదువు ఆవశ్యకతను గుర్తించి మహిళా యూనివర్సిటీని దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఏర్పాటు చేశారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. మూఢ నమ్మకాలపై జ్యోతిరావు పూలే రాజీలేని పోరాటం, ఉద్యమాలు చేశారని సీఎం చంద్రబాబు చెప్పారు.

త్వరలో బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురాబోతున్నామని చంద్రబాబు తెలిపారు. బీసీలకు 55 కార్పొరేషన్లు పెట్టామని అన్నారు. బీసీలకు ప్రత్యేక ప్రణాళిక తీసుకువచ్చామని చెప్పారు. అన్నివర్గాల కంటే మిన్నగా బీసీ వర్గాలను ముందుకు తీసుకువెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఇవాళ(శుక్రవారం) విదేశాల్లో చదువుకోవాలనే వారికి ఒక్కొక్కరికి 15 లక్షలు ఇస్తున్నామని చెప్పారు.

టీడీపీ వచ్చేంతవరకు బలహీన వర్గాలకు న్యాయం జరగలేదని అన్నారు. వారికి న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీనేనని తెలిపారు. టీడీపీకి వెన్నెముక బలహీన వర్గాలు.. అలాంటి వారిని పూర్తిగా ఆదుకుంటామని సీఎం మాటిచ్చారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25వేలు గౌరవ వేతనం ఇస్తున్నామని ప్రకటించారు. బీసీల రిజర్వేషన్లను 26 నుంచి 34 శాతం పెంచడానికి చర్యలు చేపట్టామని అన్నారు. బీసీల రక్షణకు చట్టం రూపొందించడానికి ఒక కమిటీని వేశామని తెలిపారు. కమిటీ నివేదిక వచ్చిన వెంటనే చట్టం తీసుకువస్తామని తెలిపారు. నూజివీడును పూర్తిగా అభివృద్ధి చేసేందుకు మంత్రి పార్థసారథికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అప్పులు చేసి అవినీతికి పాల్పడితే ఆ సమాజం మనుగడ సాగదని చెప్పారు. అన్ని చేయాలని ఉంది.. కానీ గల్లా పెట్టె ఖాళీ అయ్యిందన్నారు.

అప్పులు అడగాలంటే ఆంక్షలు పెడుతున్నారని చెప్పారు. ఈ రోజు హైదరాబాద్ చూస్తే, ఎక్కడ చేసినా తానే కనిపిస్తానని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు పెట్టాను..ఒక్కొక్కటికీ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాలు తానే పెట్టాను..పొదుపు సంఘాలు తానే ప్రారంభించానని గుర్తుచేశారు. డ్వాక్రా సంఘాలు తన మానస పుత్రిక అని ఉద్ఘాటించారు. రేపో ఎల్లుండో తల్లికి వందనం ఇస్తున్నామని.. ఎంత మంది ఉంటే అందరికీ ఇస్తామని తెలిపారు. మన రాష్ట్రంలో సంతాన రేటు 1:1.5 రేషియాలో ఉందన్నారు. 2035 నాటికి ఇలాగే జనాభా తగ్గిపోతుందని చెప్పారు. అందుకే సంతాన రేటు రెండుకు పెరగాలని అన్నారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌ను తానే పూర్తి చేస్తానని మాటిచ్చారు. మే నుంచి రైతులకు రూ.20 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తే, రాష్ట్రం రూ.14 వేలు ఇస్తుందని.అది మూడు విడతలగా ఇస్తామని స్పష్టం చేశారు.

బూతులు తిట్టారు..

అసెంబ్లీలో బూతులు మాట్లాడేవారు..తనను బూతులు తిట్టారని చెప్పారు చంద్రబాబు. అది గౌరవసభ కాదు, కౌరవ సభ అని అప్పుడే చెప్పా.. సీఎంగా అడుగు పెడతానని చెప్పానని.. అలాగే అసెంబ్లీకి వచ్చానని గుర్తుచేశారు. ఆడపిల్లల క్యారెక్టర్‌ను హననం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సోషల్ మీడియాలో దారుణంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డిను హత్య చేసి గుండెపోటు అన్నారని.. తప్పులు చేసే వారిని ఉపేక్షించబోమని వార్నింగ్ ఇచ్చారు. అనంతపురం వెళ్లి జగన్ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.

ఇంతకుముందు వైసీపీ హయాంలో తనను కూడా రాష్ట్రంలో తిరగనివ్వలేదని చెప్పారు. ఇప్పుడు స్వేచ్ఛగా తిరగనిస్తుంటే, రౌడీయిజం చేస్తున్నారని మండిపడ్డారు. నేరాలు చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పీ4 విధానంతో అందరి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. డబ్బులు, సంపద అనేది అందరి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేదిగా ఉండాలని తెలిపారు. ఒకరివద్దే సంపద ఉండిపోకూడదని.. మరొకరు డబ్బులు లేకుండా, చదువు లేకుండా ఇబ్బంది పడకూడదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

హెలిప్యాడ్ వద్ద ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్వాగతం

నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో జీరో పావర్టీ-పీ4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హెలిప్యాడ్ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఘన స్వాగతం పలికారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.. ముఖ్యమంత్రి కి పుష్పగుచ్ఛం అందజేశారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

రేపే ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు

అమరావతి, ఏప్రిల్ 11: ఏపీలోని ఇంటర్ విద్యార్థులకు బిగ్ అలర్ట్. రేపు ఇంటర్ ఫలితాలను రిలీజ్ చేస్తున్నట్లు మంత్రి నారాలోకేశ్ తెలిపారు. ఉదయం 11గంటలకు ఇంటర్ మొదటి, రెండవ సంవత్సర ఫలితాలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఫలితాలను వెబ్ సైట్లో చూసుకోవచ్చు. కాగా,ఫలితాలతో పాటు మార్క్ మెమోలను సైతం విద్యార్థులకు వాట్స్ ప్ ద్వారా పంపనున్నట్లు ఇంటర్ అధికారులు వెల్లడించారు..

మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 19వ తేదీ నిర్వహించగా.. రెండో సంవత్సరం ఇంటర్ ఎగ్జామ్స్ మార్చి 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించారు. ఇక విద్యార్థులకు పరీక్ష ఫలితాలు తెలుసుకునేందుకు మల్టిపుల్ ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా సులభంగా ఫలితాలను తెలుసుకోవచ్చు. ఏపీ ఇంటర్ ఎగ్జామ్స్ ఫలితాలు తెలుసుకోవడానికి ముందుగా అధికారిక వెబ్సైట్లో సులభంగా తెలుసుకోవచ్చు.

ఒంటిమిట్ట రామయ్యకు..స్వర్ణ కిరీటాల సమర్పణ

ఒంటిమిట్ట,ఏప్రిల్ 11: శ్రీ రామనవమి ఉత్సవాల వైభవంతో కనువిందు చేస్తున్న ఒంటిమిట్ట కోదండరామస్వామికి ఈరోజు రూ.6 కోట్ల విలువైన మూడు బంగారు కిరీటాల సమర్పణ జరిగింది. ప్రముఖ పెన్నా సిమెంట్ సంస్థ అధినేత పెన్నా ప్రతాప రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసివచ్చి స్వామికి సమర్పించారు.

ఇవాళ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ కిరీటాలను వారు తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్యామలరావులకు అందచేశారు. ఆలయంలోని మూలమూరతులైన సీతా రామ లక్ష్మణుల కోసం రూ. 6.60 కోట్ల వ్యయంతో విలువైన రాళ్ళను పొదిగించి చేయించిన ఆ మూడు బంగారు కిరీటాల బరువు 7 కిలోగ్రాములని టీ టీ డి ప్రకటించింది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మూల మూర్థులకు అలంకరించారు.

మంత్రుల పేషీలలోని వెద పురుగులను ఏరి వేస్తున్న చంద్రబాబు ..

అమరావతి, ఏప్రిల్ 11: ఏపీ ప్రభుత్వంలో కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి పది నెలల కాలం పూర్తి అవుతోంది. ఈ సమయంలో మంత్రుల పని తీరు పైన ముఖ్యమంత్రి ఫోకస్ చేసారు. ఇప్పటికే మంత్రులకు ర్యాంకులు ఇస్తున్నారు. సమర్ధవంతంగా పని చేయాలని సూచిస్తున్నారు. ఇదే విధంగా మంత్రుల పేషీలు.. వారి సిబ్బంది పైనా ఫోకస్ చేసారు. ప్రభుత్వం ఏర్పాటైన తొలి రోజుల్లోనే మంత్రులు తమ సిబ్బంది నియామకంలో కీలక సూచనలు చేసారు. కాగా, ఇప్పుడు మంత్రులు ఏరి కోరి తెచ్చుకొని.. విమర్శలకు కారణమవుతున్నవారి పైన కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. తాజాగా తీసుకున్న నిర్ణయంతో మంత్రుల పేషీల్లో సంచలనంగా మారుతోంది. చంద్రబాబు నిర్ణయంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రులు తమ వ్యక్తిగత.. పేషీ సిబ్బంది విషయంలో ఏ రకమైన విమర్శలకు తావు లేకుండా నిర్ణయాలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. కొందరు మంత్రుల పేషీల్లో సిబ్బందిపైన ఆరోపణలు ఉన్నాయి.

కొద్ది రోజుల క్రితం హోం మంత్రి అనిత సిబ్బంది విషయంలో ఆరోపణలు రావటంతో తప్పించారు. ఆ తరువాత మంత్రులు అలర్ట్ అయ్యారు. కొందరు మంత్రుల ఓఎస్డీలు, పేషీ సిబ్బంది పైన విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో పని చేసిన వారినే కొందరు మంత్రులు కొనసాగించటం పైన ఫిర్యాదులు అందాయి. అయితే, కీలక శాఖల మంత్రుల వద్ద పని చేస్తున్న కొందరు సిబ్బంది పైన వస్తున్న విమర్శలతో ముఖ్యమంత్రి నివేదికలు కోరారు. వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటున్నారు. కొల్లు ఓఎస్డీ తొలిగింపు తాజాగా మంత్రి కొల్లు ఓఎస్డీ తొలిగింపు వ్యవహారం మంత్రుల వద్ద చర్చగా మారింది. ఎక్సైజ్, గను ల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వద్ద ఓఎస్‌డీగా పనిచేస్తోన్న రాజాబాబును ప్రభుత్వం పక్కన పెట్టింది. రాజాబాబు గనులశాఖ అధికారి. ఆ శాఖలో జాయింట్‌డైరెక్టర్‌గా పనిచేస్తూ 2024 మార్చి లో పదవీ విరమణ పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన్ను కొల్లు రవీంద్రకుఓఎస్‌డీగా తీసుకోవాలని సంప్రదింపులు జరిగిన సమయంలోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. గనులశాఖలో పనిచేసినప్పుడు ఆయనపై అనేక విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. అలాంటి అధికారిని మంత్రి ఓఎస్‌డీగా ఎలా తీసుకుంటారన్న ప్రశ్నలు వచ్చినా నాడు మంత్రి లెక్కపెట్టలేదు. రాజాబాబే ఓఎస్డీగా కావాలని పట్టుబట్టి మరీ తీసుకున్నారు. ఈ 10 నెలల పాలనలో గనులశాఖ పనితీరు, అప్రీల్ రివిజన్ కేసులపై అనేకానేక ఆరోపణలు వచ్చాయి. ఇక మరికొందరి మంత్రుల పేషీలో పని చేస్తున్న పాత కాపులు వివరాలను కూడా చంద్రబాబు తెప్పించుకున్నట్లు సమాచారం .. త్వరలోనే మరికొందర్ని కూడా ఇంటికి పంపనున్నట్లు టాక్..

సాక్ష్యం చెప్పేందుకు సెలవుపై వచ్చిన సైనికుడు.. కాల్చి చంపిన దుండగులు

లక్నో, ఏప్రిల్ 11: బంధువు హత్య కేసులో కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు ఒక సైనికుడు సెలవుపై ఇంటికి వచ్చాడు. రాత్రి వేళ భోజనం తర్వాత వాకింగ్‌కు వెళ్లిన అతడ్ని దుండగులు కాల్చి చంపారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ముదిఖేడి గ్రామానికి చెందిన 27 ఏళ్ల విక్రాంత్ గుర్జార్ ఆర్మీ జవాన్. జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

కాగా, నాలుగేళ్ల కిందట విక్రాంత్ బంధువైన రజత్‌ను కొందరు వ్యక్తులు కత్తితో పొడిచి హత్య చేశారు. ఈ కేసులో కీలక సాక్షి అయిన ఆ జవాన్, కోర్టులో వాంగ్మూలం ఇచ్చేందుకు నాలుగు రోజుల సెలవుపై ఏప్రిల్ 8న గ్రామానికి వచ్చాడు. ఆ మరునాడు రాత్రి భోజనం తర్వాత వాకింగ్ కోసం బయటకు వెళ్లాడు. అయితే విక్రాంత్ ఇంటికి తిరిగి రాలేదు. మొబైల్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.

మరోవైపు గురువారం తెల్లవారుజామున కాల్పుల గాయాలతో మరణించి రోడ్డు వద్ద పడి ఉన్న విక్రాంత్ మృతదేహాన్ని గ్రామస్తులు చూశారు. అతడి కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. విక్రాంత్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులను మోహరించారు. ఆర్మీ జవాన్ హత్యపై దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లెలి డెడ్ బాడీ దొరికిన చోటనే గోతిలో అన్న మృతదేహం..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కొద్ది రోజుల క్రితం ఓ కాలిపోయిన కారులో మహిళ మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఆమె మృతదేహం లభ్యమైన చోటనే గోతిలో ఆమె సోదరుడి మృతదేహం దొరికింది. అన్నా చెల్లెల్లు ఇద్దరూ అత్మహత్యల కు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం చమోలీ జిల్లాలోని తపోవన్ ఏరియాలో కొన్ని రోజుల క్రితం ఓ 40 ఏళ్ల మహిళ మృతదేహం లభ్యమైంది. కాలిపోయిన కారులో కాలిపోయిన స్థితిలో ఆమె మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఇప్పుడు ఆమె మృతదేహం లభించిన ప్రదేశంలోనే రోడ్డు పక్కన గోతిలో ఆమె 45 ఏళ్ల సోదరుడి మృతదేహం దొరికింది.

ముందుగా మహిళ మృతదేహం లభ్యం కాగానే దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఆమె తన సోదరుడితో కలిసి ఉండేదని తెలిసింది. రెండు నెలల క్రితం వాళ్లు ఒడిశాలోని రాయ్‌గఢ్ నుంచి చమోలీకి వచ్చి ఉంటున్నారని, రెంటు లేని ఓ ఇంట్లో తలదాచుకునేవారని, రోజువారికి ఖర్చుల కోసం ఇరుగు పొరుగు వారిని డబ్బులు అడుక్కునే వారని పోలీసులు గుర్తించారు.

ఓటరు దేవుళ్లకు లోకేష్ 'పట్టా'భిషేకం

-4 వ రోజుకి చేరిన మన ఇల్లు - మన లోకేష్
-మంత్రి నారా లోకేష్.. ప్రేమ కానుక..!
-పసుపు.. కుంకుమ.. నూతన వస్త్రాలు..
-శాశ్వత ఇంటి పట్టాలు..లబ్ధిదారులకు అందజేత
-హామీలు.. యుద్ధ ప్రాతిపదికన అమలు.
-ప్రజలు 91 వేల భారీ మెజారిటీ ఇచ్చారు..
-నా గుండెల్లో పెట్టుకుంటా.. నారా లోకేష్ భావోద్వేగం..!
-ఈ నె 13న వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
-రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది
-అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలను అభివృద్ధి చేస్తాం..
-అవినీతి రహిత పాలనే మా లక్ష్యం..!
-మంగళగిరిలో శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ
-రత్నాల చెరువుకు చెందిన 600 మందికి
-మహానాడు ప్రాంతానికి చెందిన వారికి 430 పట్టాలు..
-మహాత్మా జ్యోతిరావు పూలే కు ఘన నివాళి

అమరావతి, ఏప్రిల్ 11: రాష్ట్ర ఐటి , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ప్రేమ పూర్వక కానుకలు అందించారు. లబ్ధిదారులకు పసుపు కుంకుమ నూతన వస్త్రాలు పెట్టి శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. దీనితో లబ్ధిదారుల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. గత ఎన్నికలలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి లోకేష్ అమలు చేస్తున్నారు.

మంగళగిరి నియోజక వర్గ ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతి పదికన అమలుచేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం ఉదయం మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో రత్నాల చెరువుకు చెందిన 600 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. కాగా మహానాడు ప్రాంతానికి చెందిన 430 మందికి పట్టాలు అందజేశారు. మొత్తం నాలుగవ రోజు 1030 మందికి పట్టాల పంపిణీ చేయడం విశేషం.

ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. కొన్ని నిర్ణయాలు మన జీవితాలనే మార్చేస్తాయి. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో నేనొక నిర్ణయం తీసుకున్నా. మీ సమస్యలేంటో నాకు తెలియదు. నేనేంటో మీకు తెలియదు. ఎన్నికలకు 21 రోజుల ముందు టీడీపీ అభ్యర్థిగా పోటీచేశా. 5,300 ఓట్లతో ఓడిపోయా. మొదటి రోజు బాధ కలిగింది, ఆవేదన కలిగింది. రెండో రోజు నుంచి ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ప్రజలకు మంచి పనులు చేసి వారి మనస్సు గెలుచుకోవాలని ఆనాడే నేను నిర్ణయించుకున్నా.



26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం

ఒక్కసారి ఆలోచించండి. 2019 నుంచి 2024వరకు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మీ ఆరోగ్యం కోసం ఎన్టీఆర్ సంజీవని తీసుకురావడం జరిగింది. తాడేపల్లిలో, మంగళగిరిలో, దుగ్గిరాలలో క్లినిక్ ఏర్పాటుచేసి నేటికీ కొనసాగిస్తున్నాం. ఈ రోజుకీ సొంత నిధులతో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం. కుటుంబంలో పెళ్లి జరిగితే పెళ్లి కానుక ఇస్తున్నాం. మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ఉచితంగా కుట్టు మిషన్ ఇవ్వడంతో పాటు శిక్షణ కూడా అందించాం. వారికి ఉపాధి కూడా కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం నీరు సక్రమంగా అందించలేకపోతే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాం. యువత క్రికెట్ ఆడేందుకు మంగళగిరి ప్రీమియర్ లీగ్ ఏర్పాటుచేశాం. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్లతో పాటు మందులు అందించాం. అమెరికా డాక్టర్ల ద్వార టెలీమెడిసిన్ అందజేశాం. ఈ విధంగా దాదాపు 26 సంక్షేమ కార్యక్రమాలు మంగళగిరి ప్రజల కోసం చేపట్టడం జరిగిందన్నారు.

భారీ మెజారిటీ ఇచ్చారు.. లోకేష్ భావోద్వేగం..!

మంగళగిరి నియోజకవర్గ ప్రజలు నాకు 91 వేల భారీ మెజారిటీ అందించారు ప్రజల్ని నా గుండెల్లో పెట్టుకుంటా అంటూ మంత్రి నారా లోకేష్ ఒకింత బాగోద్వేగానికి గురయ్యారు. 2024 ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేయాలని చాలా మంది చెప్పారు. ఐదేళ్లు కష్టపడ్డా, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకున్నానని ఆనాడు చెప్పా. ఒకే స్థానం నుంచి పోటీ చేస్తా.. అది మంగళగిరి నుంచే పోటీచేస్తానని చెప్పా. ప్రచారంలో మీ వద్దకు వచ్చాను. ఏ మెజార్టీతో అయితే ఓడిపోయానో దాని పక్కన సున్నాపెట్టి 53వేల ఓట్లతో గెలిపించాలని కోరా. మీరు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని చెప్పా. సర్వేల్లో కుప్పం కంటే ఒక్క శాతం వెనుకబడి ఉన్నాం. మీరు చూపించిన అభిమానం, ప్రేమ చూసి ఒక్క ఓటు అన్నా ఎక్కువ వస్తుందని బాబు తో ఛాలెంజ్ చేశా. మంగళగిరి ప్రజలు ఎవరూ ఊహించని విధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారని నారా లోకేష్ అన్నారు.

ఈ నెల 13న వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

మీరు ఇచ్చిన మెజార్టీ కొండంత బలం. దశాబ్దాల కల వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి. ఏపీలో మొదటి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంగళగిరి నియోజకవర్గానికి శాంక్షన్ అయింది. ఈ నెల 13న శంకుస్థాపన చేస్తున్నాం. ఏడాదిలోగా పూర్తిచేస్తాం.



తమిళనాడులో మళ్లీ బిజెపి, అన్నాడిఎంకెల యుగళగీతం

చెన్నై, ఏప్రిల్ 11: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో అన్నాడీఎంకే-బీజేపీ పొత్తు ఖరారైంది. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేస్తామని పళనిస్వామితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించారు. 2026లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా, అన్నాడీఎంకే కలిసి పోటీ చేయనున్నట్లు ఆయన స్పష్టంగా తెలిపారు. ఈ మేరకు చెన్నైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, అమిత్ షా తో కలిసి అన్నాడీఎంకే పార్టీ అధ్యక్షుడు ఎడప్పాడి పళనిస్వామి, బిజెపి రాష్ట్ర శాఖాధ్యక్షుడు అన్నామలైతో పాల్గొన్నారు. ఈ సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నాయకత్వంలోనే పొత్తు కొనసాగుతుందని, ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోనే వారు ఎన్నికల బరిలోకి దిగుతారని స్పష్టం చేశారు.

పళనిస్వామే సిఎం ..

అంతేకాదు.. తమిళనాడులో ఎన్డీయే కూటమి నుంచి సీఎం అభ్యర్థిగా పళనిస్వామి పేరును కూడా అమిత్ షా ప్రకటించారు. ఎలాంటి షరతులు లేకుండానే అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు ఖరారు చేసుకున్నామని అమిత్ షా స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఒక పక్క పళనిస్వామిని, మరో పక్క అన్నామలైని కూర్చోబెట్టుకుని మరీ ఎన్డీయేతో అన్నాడీఎంకే పొత్తును అమిత్ షా ప్రకటించడం గమనార్హం. అన్నాడీఎంకేతో కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. అధికారం, సీట్ల పంపకాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాలను జోక్యం చేసుకోమని అమిత్ షా పేర్కొన్నారు.

1988లో దివంగత మాజీ సీఎం జయలలిత నేతృత్వంలో బీజేపీ అన్నాడీఎంకే పార్టీలు పొత్తు పెట్టుకున్నప్పుడు లోక్‌సభలో భారీ విజయాన్ని నమోదు చేసిన విషయాన్ని అమిత్ షా గుర్తు చేశారు. ఒక దశల్లో ఈ కూటమి తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు 30 స్థానాలు గెలుచుకుందని ఆయన చెప్పారు. తమిళనాడు ఎన్నికల్లో ఎన్డీయే సులభంగా గెలుస్తుందని షా ధీమా వ్యక్తం చేశారు.



అందరికి చదువు నేర్పిన మహనీయుడు జ్యోతిరావు పూలే

–కాందాడి సుదర్శన్ రెడ్డి

మేడ్చల్ ఏప్రిల్11.(ఎక్స్ ప్రెస్ న్యూస్) మహాత్మా జ్యోతిరావు పూలే

జన్మదినం సందర్భంగా టి పి సి సి లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాందాడి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి కర్కల ఉపేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లేబర్ సెల్ అధ్యక్షులు కావలి గోపాల్ , జిల్లా లేబర్ సెల్ ఉపాధక్షులు మండల సందీప్ కుమార్ గౌడ్,అశోక్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తేజ, వర్మ, లక్ష్మి పతి రాజు, శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాందాడి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతు ఏప్రిల్ 11, 1827న మహారాష్ట్రలోని పూణేలో జన్మించిన జ్యోతిరావు పూలే తండ్రి గోవిందరావు పూలే కూరగాయల వ్యాపారి, అతని తల్లి చిమ్నాబాయి చిన్నతనంలోనే మరణించారు. సామాజిక అడ్డంకులు ఉన్నప్పటికీ పూలే పూణేలోని హైస్కూల్లో విద్యను అభ్యసించారు, ఆయన కుల వ్యవస్థను, విద్యను ప్రోత్సహించ డానికి మహిళల హక్కులు మరియు అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. 1848లో భారతదేశంలో మొట్ట మొదటి బాలికల పాఠశాలను, అణగారిన తరగతుల కోసం ఒక పాఠశాలను మరియు శ్రామిక తరగతి వ్యక్తుల కోసం ఒక రాత్రి పాఠశాలను స్థాపించాడు. మహాత్మా పూలే రచనలు భారత రాజ్యాంగ ప్రధాన నిర్మాత డా " బి.ఆర్. అంబేద్కర్ వంటి ప్రముఖ వ్యక్తులను ప్రభావితం చేశాయి అని పేర్కొన్నారు.

వరంగల్ సభకు దండుకట్టండి.. పాతికేళ్ల పార్టీ సభ దద్దరిల్లాలి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఏప్రిల్, 10: వరంగల్‌లోఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు భద్రాచలం నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులంతా దండుకట్టాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. పార్టీ పాతికేళ్ల సభ కనీవినీ ఎరుగని రీతిలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భద్రాచలం నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ ఇన్‌చార్జి మానె రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం స్థానిక రెడ్డి సత్రంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరంగల్ సభ విజయవంతానికి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

ఏప్రిల్ 27 గులాబీ పార్టీ పండుగ రోజన్నారు. ఆ రోజు గ్రామ గ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలని తెలిపారు. మీరంతా కష్టపడి గెలిపిస్తే ఇక్కడి ఎమ్మెల్యే మిమ్మల్ని, పార్టీకి ద్రోహం చేసి వెళ్లిపోయారు. అయినా బాధ లేదు. రేపో మాపో మళ్లీ ఉప ఎన్నికలు రాబోతున్నాయి. ఆ ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ మళ్లీ గెలవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమవుతోందన్నారు. హామీల అమలు దగ్గర నుంచి, పాలనా పరమైన నిర్ణయాల వరకు అభాసుపాలవుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని, కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. వరంగల్ సభ దిగ్విజయానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, వివిధ మండలాల పార్టీ బాధ్యులు రాంబాబు, నర్సింహ మూర్తి, దొడ్డి తాతారావు, ఆకోజు సునీల్, కృష్ణారెడ్డి, కణితి రాముడు, బోదెబోయిన బుచ్చయ్య, రేసు లక్ష్మి, సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయాల కోసం పోరాడదాం

– ఘనంగా జ్యోతిరావు పూలే 198వ జయంతి

ఖమ్మం, ఏప్రిల్ 11 (నేటినిజం ప్రతినిధి) :భారతదేశ సంఘ సంస్కర్త, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల కోసం పోరాడదామని కొనిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడివాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం కొనిజర్ల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పూలే చిత్ర పటానికి కొనిజర్ల మండల కాంగ్రెస్ నాయకులు గుడివాడ వెంకటేశ్వర్లు, పోతురాజు ప్రసాదు, పోతురాజు సురేష్ బాబు, పొట్లపల్లి శేషగిరిరావు, సబల కృష్ణ, కనగంటిరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గుడివాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...శూద్రులకు చదువులకు దూరం చేసిన మనువాదాన్ని తోసిపుచ్చి చదువు ద్వారానే మనిషి విజ్ఞానవంతుడవుతాడని, మనువాదానికి వ్యతిరేకంగా మహాత్మ జ్యోతిరావు పూలే పోరాడాంన్నారు. మహిళలను తక్కువ చేసి వీరికి చదువులు అవసరం లేదని వంటింటికే పరిమితం చేసిన మనువాదులకు వ్యతిరేకంగా 1948లో మహారాష్ట్ర పూణే నగరంలో స్త్రీలకు పాఠశాలను ఏర్పాటు చేసిన మహానీయుడు పూలే అన్నారు. సమాజసేవ కోసం సత్య సామాజిక సంస్థను ఏర్పాటు చేసిన సంఘ సంస్కర్త అన్నారు. పూలే ఆశయ సాధన కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుడివాడ వెంకటేశ్వర్లు, పోతురాజు ప్రసాదు, పోతురాజు సురేష్ బాబు, పొట్లపల్లి శేషగిరిరావు, సబల కృష్ణ, కనగంటిరావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు సహా సామర్థ్యానికి, విజయాలకు ఉత్తరప్రదేశ్ ప్రతీక: ప్రధాని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:ఈ రోజు ఉత్తరప్రదేశ్ వారణాసిలో రూ. 3,880 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, కాశీ నగరంతో తనకు గల గాఢాను బంధాన్ని గురించిన అనుభూతులను పంచుకున్నారు. తన కుటుంబ సభ్యులు, ప్రాంత ప్రజలు తనకు అందించిన ఆశీస్సులకు, తనపై కురిపించే ఆదరాభిమానాలకు శ్రీ మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలందించే ప్రేమ తనను రుణగ్రస్తుడిని చేసిందని, తాను కాశీకి, కాశీ తనకు చెందుతుందన్నారు. రేపు హనుమాన్ జన్మోత్సవమని గుర్తు చేస్తూ, కాశీలోని సంకట మోచన మహారాజ్ ను సందర్శించే గౌరవం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. హనుమాన్ జన్మోత్సవ పావన సందర్భాన్ని జరుపుకోవడానికి ముందస్తుగా అభివృద్ధిని వేడుక చేసుకునేందుకు కాశీ ప్రజానీకం తరలి రావడం హర్షదాయకమన్నారు.

"గత దశాబ్ద కాలంలో వారణాసి అభివృద్ధి వేగం పుంజుకుంది" అని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఈ నగరం ఆధునికతను అలవర్చుకుంటూనే వారసత్వాన్ని కాపాడుకుంటూ వెలుగులీనే భవిష్యత్తుకు నాంది పలుకుతోందన్నారు. పూర్వాంచల్ ఆర్థిక చిత్రంలో కేంద్రస్థానం దక్కించుకున్న కాశీని ఇక పురాతన నగరంగా కాక, ప్రగతిశీల నగరంగా గుర్తించవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. కాశీ విశ్వేశ్వరుడు పూన్చిన అభివృద్ధి రథాన్ని అధిరోహిస్తున్న కాశీ, పూర్వాంచల్ ను ఆ బాటపై ముందుకు తీసుకువెళుతోందని వ్యాఖ్యానించారు.

కాశీ, పూర్వాంచల్ లోని ప్రాంతాలకు సంబంధించి నేడు ప్రారంభించిన పలు అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల గురించి ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా రహదారి అనుసంధానం బలపడుతుందని, ప్రతి ఇంటికీ నీటి వసతి కల్పించాలన్న ఆశయం నెరవేరగలదని, విద్య, ఆరోగ్యం, క్రీడా సదుపాయాలు మెరుగవుతాయని చెప్పారు. పూర్వాంచల్ ను అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దడంలో భాగంగా యువతకు, ప్రతి ప్రాంతానికి, కుటుంబానికి మెరుగైన వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. తాము ప్రవేశపెడుతున్న పథకాల ద్వారా ప్రతి కాశీ పౌరుడూ లబ్ధి పొందగలడంటూ వారణాసి, పూర్వాంచల్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు జ్యోతిబా పూలే జయంతి సందర్భాన్ని గుర్తు చేసుకున్న ప్రధాని... మహిళా సాధికారత, ఆత్మ విశ్వాస పెంపు, సమాజ సంక్షేమానికి మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రీబాయి ఫూలేలు తమ జీవితాలను అంకితం చేశారని అన్నారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు తాము చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వివరించారు. తమ ప్రభుత్వం 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' అనే సూత్రాన్ని నమ్మి ఆచరిస్తోందని స్పష్టం చేశారు. పూర్వాంచల్ లో పశువులను పెంచుతున్న కుటుంబాలను అభినందించిన శ్రీ మోదీ, ఈ పనిలో ఎంతో శ్రమిస్తున్న మహిళలు ఈ ప్రాంతానికే స్ఫూర్తిదాతలుగా ఉన్నారని కొనియాడారు. ఈ మహిళలపై ఉంచిన విశ్వాసం అద్భుతమైన ఫలాలను ఇచ్చి, చరిత్ర సృష్టించిందని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ బనాస్ పాల ఉత్పత్తి కేంద్రంతో అనుబంధమున్న పశువుల పెంపకందారులకు బోనస్ సొమ్మును బదిలీ చేసే అంశాన్ని ప్రధాని ప్రస్తావించారు. రూ. 100 కోట్లకు పైగా బోనస్ రూపంలో వంపిణీ చేసిన సొమ్ముని బహుమతిగా అందించలేదని, వారి నిబద్ధతకు, శ్రమకి గుర్తింపుగా అందజేశామని అన్నారు. శ్రమ, పట్టుదల వెలకట్టలేనివని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

పూర్వాంచల్ లో నివసించే మహిళలు ఒకప్పుడు ఉపాధి గురించి చింతిస్తే, నేడు వారే "లఖ్ పతీ దీదీలు' గా మారి ప్రగతి మార్గంలో పయనిస్తున్నారన్నారు. బనాస్ డైరీ... కాశీలో నివసించే వేలాది మంది కుటుంబాల్లో, నగర ముఖచిత్రంలో పరివర్తనకు మూలమని శ్రీ మోదీ అన్నారు. శ్రమకు తగిన గుర్తింపునిచ్చిన బనాస్ డైరీ, కాశీవాసుల ఆశలకు, ఆశయాలకు రెక్కలు తొడిగిందన్నారు. ఇటువంటి ప్రగతి ఈ ప్రాంతానికే పరిమితమవలేదని, దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఈ మార్పుని స్పష్టంగా గమనించవచ్చని చెప్పారు. "పాల ఉత్పత్తిలో నేడు భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంది. గత దశాబ్దంలోనే పాల ఉత్పత్తిలో 65 శాతం వృద్ధి నమోదైంది" అని చెప్పారు. లక్షలాది మంది రైతులు, పశు పోషకులు గత పదేళ్ళుగా చేసిన కృషి వల్లే ఈ ఘనత సాధ్యమైందని కితాబిచ్చారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటి అమలును వేగవంతం చేసిందని చెబుతూ, పాడి రైతులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డులను అందించి, రుణ మొత్తాన్నీ పెంచామని, సదుపాయాలను మెరుగుపరిచామని, పలు రాయితీలు కల్పించామని వివరించారు. పశువుల్లో తీవ్ర ఇబ్బందులను కలిగించే ఫుట్ అండ్ మౌత్ వ్యాధి కట్టడికి ఉచిత టీకా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రధానమంత్రి వెల్లడించారు. పాల సేకరణ క్రమ పద్ధతిలో సాగేందుకు 20,000 పాడి సహకార సమాఖ్యల పునరుద్ధరణ పనులు చేపట్టిన ప్రభుత్వం, లక్షలాది మంది కొత్త సభ్యులతో సమాఖ్యల పరిపుష్టికి కృషి చేసిందని చెప్పారు. దేశవాళీ పశుజాతుల అభివృద్ధిపై దృష్టి సారించాలన్న ప్రధాని, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా మేలిమి జాతుల పెంపకం కోసం శాస్త్రీయమైన పద్ధతులు అవలంబించాలని సూచించారు. తాము ప్రవేశపెట్టిన పథకాలు పశుపోషకులకు మెరుగైన అవకాశాలు, కొత్త మార్కెట్లు, కొత్త అభివృద్ధి అవకాశాలను కల్పించేందుకు ఉద్దేశించినవని శ్రీ మోదీ వివరించారు. పూర్వాంచల్ ప్రాంతంలో అభివృద్ధి ఆశయాన్ని వ్యాప్తి చేసినందుకు బనాస్ డైరీ కాంప్లెక్సుకు ప్రధాని అభినందనలు తెలియజేశారు. డైరీ ఈ ప్రాంతంలో మేలు జాతి గిర్ ఆవులను పాడి రైతులకు అందించిందని, వాటి సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో అవసరమైన గ్రాసాన్ని అందించేందుకు వారణాసిలో ఏర్పాట్లు ప్రారంభించిందని అభినందనలు తెలియజేశారు. పూర్వాంచల్ లోని లక్షమందికి పైగా పాడి రైతుల నుంచి పాలను సేకరిస్తున్న బనాస్ డైరీని ప్రశంసించిన శ్రీ మోదీ, పాడి రైతుల సాధికారతకు, వారి జీవనోపాధి మెరుగుదలకు ఈ చర్య దోహదపడుతోందన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఆయుష్మాన్ వయో వందన కార్డులను పంపిణీ చేయడం తనకు దక్కిన విశిష్ట అవకాశమని ప్రధానమంత్రి అన్నారు. వారి ముఖాల్లో కనిపిస్తున్న సంతృప్తి.. ఈ పథకం విజయవంతం అయిందనడానికి నిదర్శనమని తెలిపారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల కుటుంబసభ్యులకున్న ఆందోళనల గురించి తెలియజేస్తూ.. 10–11 ఏళ్ల క్రితం పూర్వాంచల్‌లో వైద్య సేవలు పొందడానికి ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపారు. "ప్రస్తుతం కాశీ ఆరోగ్య రాజధానిగా మారింది" అంటూ ఈ ప్రాంతంలో సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. అధునాతన సౌకర్యాలున్న ఆసుపత్రులు ఒకప్పుడు ఢిల్లీ, ముంబయి లాంటి నగరాలకు మాత్రమే పరిమితమై ఉండేవని, ఇప్పుడు ప్రజల ఇళ్లకు చేరువలో ఉన్నాయని పేర్కొన్నారు. పౌరులకు అవసరమైన సదుపాయాలను వారికి అందుబాటులోకి తీసుకురావడమే అభివృద్ధి సారాంశమని చెప్పారు.

గడచిన దశాబ్దంలో ఆరోగ్యరంగంలో సాధించిన గణనీయమైన పురోగతి గురించి మాట్లాడుతూ ఆసుపత్రుల సంఖ్యను పెంచడమే కాకుండా.. రోగుల గౌరవాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగా తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకం పేదలకు వరం లాంటిదని, ఇది రోగులకు అవసరమైన చికిత్సను అందించడమే కాకుండా.. వారిలో విశ్వాసాన్ని నింపుతోందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా వారణాసికి చెందిన వేల మంది, ఉత్తర ప్రదేశ్ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ప్రయోజనం పొందుతున్నారు. దీని ద్వారా అందే వైద్యసహాయం, శస్త్ర చికిత్స, ఉపశమనంతో వారి జీవితాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవడంతో ఉత్తరప్రదేశ్‌లోని లక్షలాది కుటుంబాలకు కోట్ల రూపాయలు ఆదా అయినట్లు వెల్లడించారు. వృద్ధులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని తాను ఇచ్చిన హామీ ఆయుష్మాన్ భారత్ వయో వందన పథకానికి దారి తీసిందని చెప్పారు. ఇది 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ వారి ఆదాయంతో సంబంధం లేకుండా ఉచిత చికిత్స అందిస్తుందని తెలిపారు. వారణాసిలో అత్యధికంగా 50,000 వయో వందన కార్డులు పంపిణీ అయ్యాయని తెలిపారు. ఇది కేవలం సంఖ్య మాత్రమే కాదని, ఆరోగ్య సేవలను అందించడంలో అంకిత భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. చికిత్స కోసం భూమిని అమ్మడం, రుణాలు తీసుకోవడం లేదా నిస్సహాయ స్థితిలో మిగిలిపోకుండా సహాయపడుతోందని తెలియజేశారు. ఆయుష్మాన్ కార్డుల ద్వారా వారి వైద్య సేవలకు అవసరమైన ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పనతో కాశీలో సాధించిన గణనీయమైన మార్పుల గురించి ప్రధాని ప్రముఖంగా వివరించారు. ఇది సందర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంటోందని తెలిపారు. ప్రతి రోజూ లక్షల సంఖ్యలో వారణాసిని సందర్శిస్తారని, పవిత్ర గంగానదిలో స్నానమాచరించి, బాబా విశ్వనాథుడిని ప్రార్థిస్తారన్నారు. వారిలో చాలా మంది కాశీలో వచ్చిన మార్పులను ప్రత్యేకంగా మెచ్చుకుంటున్నారని తెలిపారు. కాశీలో రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయం పదేళ్ల క్రితం ఉన్నట్లుగానే ఇప్పుడూ ఉంటే.. ఈ నగరం ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చి ఉండేదని అభిప్రాయపడ్డారు. చిన్న పండగలకు సైతం ట్రాఫిక్ జామ్ అయ్యేదని, వేడి, దుమ్మును భరిస్తూనే సందర్శకులు మొత్తం నగరం చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు. ఫ్లూల్వారియా ఫ్లైఓవర్ నిర్మాణం దూరాన్ని తగ్గించి, సమయం ఆదా చేస్తోందని, రోజువారీ ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనాన్ని తీసుకొచ్చిందని అన్నారు. రింగ్ రోడ్డు ప్రయోజనాలను సైతం ప్రధానమంత్రి తెలిపారు. జౌన్‌పూర్, ఘాజీపూర్ గ్రామీణ ప్రాంత వాసులకు, బల్లియా, మవు, ఘాజీపూర్ జిల్లాల నుంచి ఎయిర్‌పోర్టుకు చేరుకొనేందుకు ప్రయాణ సమయం, ట్రాఫిక్ రద్దీని తగ్గించిందని తెలిపారు.

ఘాజీపూర్, జౌన్‌పూర్, మిర్జాపూర్, ఆజాంఘడ్ తదితర నగరాలకు త్వరగా, సౌకర్యవంతంగా చేరుకొనేలా ఈ ప్రాంతంలో మెరుగైన రవాణా సదుపాయాలు, విస్తరించిన రహదారుల గురించి శ్రీ మోదీ వివరించారు. గతంలో ట్రాఫిక్ రద్దీతో సతమతమైన ఈ ప్రాంతాలు ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గడచిన దశాబ్దంలో వారణాసి, చుట్టుపక్కల ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు రూ.45,000 కోట్లు పెట్టుబడి పెట్టామని తెలిపారు. ఈ పెట్టుబడులు.. పౌలిక సదుపాయాలతో పాటు నమ్మకాన్ని కూడా పెంచాయని, కాశీతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు లబ్ధి చేకూర్చాయని ఆయన పేర్కొన్నారు. వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టుల విస్తరణను ఆయన ప్రకటించారు. ప్రస్తుతం జరుగుతున్న లాల్ బహదూర్ శాస్త్రి విమానాశ్రయ విస్తరణ పనులు, ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేలా చేపడుతున్న ఆరు లైన్ల సొరంగ మార్గ నిర్మాణం పనుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. భదోహి, ఘాజియాపూర్, జౌన్‌పూర్‌లను అనుసంధానించే వివిధ ప్రాజెక్టులతో పాటు బిఖారీపూర్, మందౌడియాలో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రారంభాన్ని కూడా గుర్తు చేశారు. ఈ డిమాండ్లను నెరవేర్చడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారణాసి నగరాన్ని సారనాథ్‌తో కలిపేలా కొత్త వంతెన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే పర్యాటకులు సారనాథ్ చేరుకోవాలంటే నగరంలోకి ప్రవేశించాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టులు పూర్తయితే రానున్న నెలల్లో కాశీకి చేరుకోవడం మరింత సులభమవుతుందని, అభివృద్ధి ఈ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలను పెంచుతుందని అన్నారు. జీవనాధారం, ఆరోగ్యసేవల నిమిత్తం వారణాసికి వచ్చే వారికి ప్రయాణ సౌలభ్యాన్ని పెంచుతుందన్నారు. కాశీలో రోప్‌వే ఏర్పాటు చేసే ప్రయత్నాలు ప్రారంభమైన విషయాన్ని కూడా ప్రస్తావించారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఈ సౌకర్యం ఉన్న నగరాల్లో కాశీ కూడా ఒకటిగా నిలుస్తుందని తెలిపారు.

వారణాసిలో చేపడుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్వాంచల్ యువతకు లబ్ధి చేకూరుస్తాయని శ్రీ మోదీ అన్నారు. కాశీ యువత క్రీడల్లో రాణించేలా నిరంతర అవకాశాలను కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడించారు. యువ అథ్లెట్ల కోసం కాశీలో నిర్మిస్తున్న వివిధ స్టేడియాలు, ఎక్స్ లెన్స్ కేంద్రాల గురించి తెలియజేశారు. వారణాసికి చెందిన వందల మంది క్రీడాకారు?లు శిక్షణ పొందుతున్న కొత్త స్పోర్ట్స్ కాంప్లెక్స్ గురించి ప్రధాని గుర్తు చేశారు. ఎంపీ క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఈ మైదానాలపై తమ ప్రతిభను చూపించే అవకాశం దొరికిందని అన్నారు.

అభివృద్ధి, వారసత్వాన్ని సమతౌల్యం చేస్తూ సాగిస్తున్న భారత్ ప్రయాణం గురించి తెలియజేస్తూ.. దీనికి కాశీని అత్యుత్తమ ఉదాహరణగా పేర్కొన్నారు. గంగా ప్రవాహం, భారతీయ చైతన్యం గురించి వివరిస్తూ "దేశ ఆత్మను, వైవిధ్యాన్ని అందంగా చూపించే చిత్తరువు కాశీ" అని వర్ణించారు. కాశీలోని ప్రతి ఇంట్లో ప్రత్యేకమైన సంస్కృతి, భారతీయతలోని వైవిధ్యం ప్రతిబింబిస్తుందని అన్నారు. కాశీ–తమిళ సంగమం లాంటి కార్యక్రమాలు దేశ ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. దేశ వైవిధ్యాన్నంతా ఒకే చోట ప్రదర్శించేలా కాశీలో నిర్మించనున్న ఏక్తామాల్ గురించి వివరించారు. ఇది వివిధ జిల్లాలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శిస్తుంది.

ఇటీవల కొన్నేళ్లలో ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకొన్న ప్రగతిని ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, ఈ రాష్ట్రం తన ఆర్థిక ముఖచిత్రంతో పాటు తన దృష్టికోణాన్ని కూడా మార్చుకొందన్నారు. ఉత్తరప్రదేశ్ ఇక అవకాశాల నేల మాత్రమే కాదని, సామర్థ్యాలు, విజయాల నిలయంగా కూడా ఈ రాష్ట్రం మారిపోయిందని ఆయన అన్నారు. 'వేడ్ ఇన్ ఇండియా'కు ప్రపంచమంతటా ఆదరణ లభిస్తోందని ఆయన చెబుతూ.. భారత్‌లో రూపొందుతున్న ఉత్పాదనలు ప్రస్తుతం గ్లోబల్ బ్రాండ్లుగా పేరుతెచ్చుకొంటున్నాయని తెలిపారు. అనేక ఉత్పాదనలు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగులను సంపాదించుకొన్న సంగతిని ఉదాహరిస్తూ, ఈ ట్యాగులు ఉత్త లేబుళ్లే కాదు.. ఇవి అంతకు మించినవనీ, ఇవి ఈ నేలకు గుర్తింపు లభించినట్లు సూచించే ధ్రువపత్రాలుగా ప్రధాని అభివర్ణించారు. ఏదైనా ఒక ఉత్పాదన ఫలానా ప్రాంతంలో ప్రత్యేకంగా తయారైందని జీఐ ట్యాగ్‌లు చెబుతుంటాయని, జీఐ ట్యాగ్ చేరుకొన్న ప్రాంతంలో ఈ ట్యాగులు మరింత ఎక్కువ వాణిజ్యాత్మక విజయానికి బాటలువేస్తాయని ఆయన వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్తంగా జీఐ ట్యాగింగులో ఉత్తరప్రదేశ్ నాయకత్వ స్థితిని చేజిక్కించుకుందని శ్రీ మోదీ స్పష్టం చేస్తూ, రాష్ట్ర కళలకు, చేతివృత్తి ఉత్పాదనలకు, నైపుణ్యాలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించడం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. వారణాసి, వారణాసి చుట్టుపక్కల ప్రాంతాల్లో తయారవుతున్న 30కి పైగా ఉత్పాదనలకు జీఐ ట్యాగులు లభించాయని, జీఐ ట్యాగులు ఈ ఉత్పాదనలకు పాస్‌పోర్టు లాంటివంటూ చమత్కరించారు. వారణాసి తబలా, షెహనాయి, గోదలకు అలంకరించే పెయింటింగులు, రండాయీ (చల్లని పానీయాలు), భర్వాన్ లాల్ మిర్చ్, లాల్ పేడా, తిరంగా బర్ఫీ వంటి జీఐ గుర్తింపు పొందిన ఈ ప్రాంత ఉత్పాదనలను కొన్నింటిని ఆయన ఉదాహరించారు. ఈమధ్యే జీఐ ట్యాగులను సంపాదించిన జౌన్‌పూర్ ఇమార్తీ, మధుర సాంధీ కళ, బుందేల్‌ఖండ్ కఠియా గోధుమ, పీలీభీత్ వేణువు, ప్రయాగ్‌రాజ్ మూంజ్ గడ్డిని ఉపయోగించి అల్లే బుట్టలు, గోదకు వేలాడదీసే అలంకరణ వస్తువులు, ఇతరత్రా ఉత్పాదనలు, బరేలీ జర్‌దోజీ, చిత్రకూట్ కలప ఉత్పాదనలు, లఖీంపుర్ ఖీరీకి చెందిన థారూ జర్‌దోజీ వగైరా ఉత్పాదనలను కూడా ఆయన ప్రస్తావించారు. "ఉత్తరప్రదేశ్ మట్టి పరిమళం ఇప్పుడు సరిహద్దులను దాటిపోయి, తన వారసత్వాన్ని బహు దూర ప్రాంతాలకు వ్యాప్తి చేస్తోంద"ని ఆయన అన్నారు.

కాశీని పరిరక్షించుకోవడం అంటే భారత్ ఆత్మను రక్షించడమే అని ప్రధాని వ్యాఖ్యానించారు. కాశీని నిరంతరం శక్తిమంతంగా నిలపడం, దీని శోభను చెక్కుచెదరనీయకపోవడం, దీని ప్రాచీన భావనను ఆధునిక గుర్తింపుతో పెనవేయాలనే సామూహిక నిబద్ధతను కనబరచాలని ప్రధానంగా చెబుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ గవర్నరు శ్రీమతి ఆనందీబెన్ పటేల్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ సహా ఇతరులు పాల్గొన్నారు.

నేపథ్యం

వారణాసిలో రూ.3,880 కోట్లకు పైగా ఖర్చయ్యే వివిధ అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వారణాసిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ముఖ్యంగా రహదారి సంధానాన్ని పెంచుతానన్న తన వాగ్దానానికి అనుగుణంగానే ఈ ప్రాంతంలో వివిధ రహదారి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు... మరికొన్నింటికి శంకుస్థాపనలు కూడా చేశారు. వీటికి అదనంగా, వారణాసి రింగ్ రోడ్డు, సార్‌నాథ్‌ల మధ్య ఒక రోడ్డు బ్రిడ్జి, నగరంలోని భిఖారీపుర్, మండువాడీహ్ క్రాసింగ్‌పై ఒక ఫ్లయ్ ఓవర్‌లతోపాటు వారణాసి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఎన్‌హెచ్–31లో రూ. 980 కోట్లకు పైచిలుకు వ్యయమయ్యే ఒక హైవే అండర్‌పాస్ రోడ్ టన్నెల్ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

విద్యుత్తు రంగ మౌలికసదుపాయాల కల్పనకు దన్నుగా నిలిచేలా వారణాసి డివిజన్‌లోని జౌన్‌పుర్, చందౌలీ, గాజీపుర్ జిల్లాలలో రూ.1,045 కోట్లకు పైగా ఖర్చయ్యే రెండు 400 కేవీ, ఒక 220 కేవీ ట్రాన్స్‌మ

ఉప్పల్ నియోజవర్గంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

హైదరాబాద్ ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అనాగరిఉన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహానీయుడుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని బీసీ ఉద్యమ నాయకుడు బయ్యా వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలే198వ జయంతి సందర్భంగా కుషాయిగూడ మరియు సైనిక్ పు రి చౌరస్తాలో ఆ మహానీయుడి విగ్రహానికి పనగల్లు చక్రిపాని గౌడ్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా బయ్యా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ విద్యను ఆయూదంగా మార్చి మహిళల సాదికరికత, బడుగు బలహీనవర్గాల సర్వతో ముకాభివృద్ధి కోసం పాటుపడిన పులే గారి బాట ఆచరణీయ మన్నారు. సంఘ సంకర్త విద్య వేత్త ,రచయిత మహాత్మా జ్యోతిరావు పూలే దేశంలో బడుగు బలహీన వర్గాలకు విద్య బోధన వ్యవస్థాపకుడు మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గణేష్ ముదిరాజ్. రాజు ముదిరాజ్. ఉ.ఐ రామ్ కుమార్ మధు యాదవ్ గణేష్ యాదవ్ వరలక్ష్మి రమా గారు తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

– కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నల్గొండ, ఏప్రిల్ 11: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం బీఆర్ఎస్ మునుగోడు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు కావస్తున్న శుభ సంద ర్భంగా పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించింది. కావునా పార్టీ శ్రేణులు కనీవిని ఎరుగని రీతిలో మహాసభను విజయవంతం చేయాలన్నారు. మోసపూరిత హామీలతో అధికార లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 15 నెలలు గడిచినా హామీల అమలుకు పూనుకోకపోవడం, ప్రశ్నిస్తే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీపై సింహ గర్జన పూరించే విధంగా కేసీఆర్ భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని రానున్న రోజుల్లో అధికారం మళ్లీ తమదేనని ధీమా వ్యక్తం చేశారు. సన్నబియ్యం ముసుగులో ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా మోసం చేస్తుందన్నారు. సాధారణంగా మిల్లర్లు బియ్యంలో 5 శాతం నూకలు కలుపుతారు. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం 25 శాతం నూకలు కలపడానికి అనుమతి ఇచ్చిందన్నారు. మిల్లర్లు దొరికిందే అదునుగా 35 శాతం నూకలు కలిపి మోసాలకు తెరలేపుతున్నట్లు చెప్పారు. ప్రజలు రేవంత్ రెడ్డి మోసాలు గుర్తిస్తున్నరని సరైన సమయంలో బుద్ధి చెప్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, మండల పార్టీ నాయకులు, అన్ని గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాత్మా అనే బిరుదు పొందిన మొదటి వ్యక్తి జ్యోతిబా పూలే

-పూలేను గుండెల్లో పెట్టుకుందాం – ఆయన ఆశయాలు సాధిద్దాం

-మల్కాజ్గిరి పార్లమెంటు సబ్యులు ఈటల రాజేందర్

మేడ్చల్ మల్కాజ్గిరి ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్); మహాత్మా అనే బిరుదు పొందిన మొదటి వ్యక్తి జ్యోతిబా పూలే.పూలేను గుండెల్లో పెట్టుకుందాం – ఆయన ఆశయాలు సాధిద్దామనీ మల్కాజ్గిరి పార్లమెంటు సబ్యులు ఈటల రాజేందర్ అన్నారు.మహాత్మా జ్యోతిరావు పుల్ 198వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన ఈటల రాజేందర్. సైనికపురి చౌరస్తాలో పుల్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి జై పూలే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ సమాజ ఉద్ధారకుడు, అణగారిన జాతుల హక్కులకోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహానీయులు జ్యోతిభా పూలే, సావిత్రిభా పూలే. ఈ దేశంలో అంటరానితనం చెల్లదని చాటిచెప్పారు. ఎంతటి అణచివేత ఉన్నా ఆనాటి దుర్మార్గానికి వ్యతిరేకంగా బరిగీసి కొట్లాడిన మహనీయుడు ఆయన.దేశంలో మొట్టమొదటి బాలికల పాఠశాల ఏర్పాటుచేసింది కూడా ఆయనే. స్వయంగా సావిత్రా భా పూలే స్వయంగా ఆడపిల్లలకు పాఠాలు చెప్పారు. పూలే గారి జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా అణగారిన వర్గాలు, సమసమాజం కోసం పరితపించే వారు, సమాజ శ్రేయస్సు కోరుకొనేవారు పార్టీలకు, జెండాలకు, రాజకీయాలకు అతీతంగా జరుపుకోవడం సంతోషం. నా గురువు పూలే అని భారత దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ గారే ప్రకటించారు అంటే పూలే గొప్పతనం అర్థం చేసుకోవచ్చు. అంబేద్కర్ గారి కంటే ముందే అనేక అంశాలమీద కొట్లాడిన మహనీయుడు ఆయన.పేద, పీడిత ప్రజలకు అండగా ఉన్న ఇలాంటి గొప్ప వ్యక్తిని గుండెల్లో పెట్టుకొని పూజించుకుందాం, ఆయన ఆశయాల అమలుకు కృషిచేద్దాం.

గ్రేటర్ పరిధిలో రికార్డు స్థాయిలో రూ.2వేల కోట్లు ఆస్తి పన్ను వసూలు

హైదరాబాద్ ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆస్తిపన్ను విభాగంలోని అధికారులు, సిబ్బందిని కమిషనర్ ఇలంబర్తి సత్కరించారు. బంజారా హిల్స్‌లోని బంజారా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి రెవెన్యూ, ట్యాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లును అభినందిస్తూ.. ప్రశంస పత్రాలు అందించారు. గ్రేటర్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించిన ప్రతి పౌరుడికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పన్ను రూపేణ ప్రజలు చెల్లించిన ప్రతీ రూపాయిని అభివృద్ధి పనుల కోసమే ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. గ్రేటర్ పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.2వేల కోట్లు ఆస్తి పన్ను వసూలు కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఆస్తి పన్నుకు సంబంధించిన సమస్యలను ఆన్‌లైన్‌లో ఆరు నెలలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నెక్లెస్ రోడ్ లో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం

– బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

హైద్రాబాద్ ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాదులోని నెక్లెస్ రోడ్ లో సామాజిక సంఘసంస్కర్త బీసీల ఐకాన్, మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్నీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పూలే విగ్రహ ఏర్పాటు స్థల పరిశీలన చేసి పూలే జయంతి రోజు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు సీఎంకు బీసీ సమాజం తరపున ధన్యవాదాలు తెలిపారు.పూలే విగ్రహ ఏర్పాటు స్థల పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూమొదటిసారిగా రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వం అధికారి కంగా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండడాన్ని స్వాగతిస్తున్నామని,గత పది ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం పెట్టకుండా బీసీలను అవమానిం చారన్నారు.మాజీ సీఎం కేసీఆర్ కు హైదరాబాదులో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని బీసీలు ఎన్నిసార్లు కోరిన పట్టించుకోలేదు, కనీసం పూలే కు నివాళులర్పించలేదన్నారు.ఎన్నికల కోడ్ ముగియగానే పూలే విగ్రహ నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని, భవిష్యత్తులో రోడ్డు వెడల్పు లో గాని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా, సచివాలయం,, అసెంబ్లీ, నెక్లెస్ రోడ్ మధ్యలో పూలే విగ్రహం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించడం గొప్ప నిర్ణయమన్నారు.బీసీ సంఘాలకు కోరిన విధంగా రెండు ఎకరాల పార్క్ లో మహాత్మ పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు.బీసీ సమాజం తరపున సీఎం రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

7న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

-లక్షలాదిగా తరలి వెళదాం.. 25 ఏళ్ల గులాబీ పండుగను విజయవంతం చేద్దాం.



మహబూబాబాద్, ఏప్రిల్ 11: పెద్దవంగర మండల కేంద్రంలోని సాయి గార్డెన్లో ఈనెల 27న వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకి జన సమీకరణ కోసం నిర్వహించారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని, మన పార్టీ బలోపేతం కోసం మనం పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదని నాడు కెసిఆర్ చేసిన పనులే మనకు శ్రీరామరక్ష అని అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంది రైతును రాజు చేసింది కెసిఆర్ అయితే ఆ రైతు వెన్నెముకను విరిచింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు.

తండాలను గ్రామపంచాయతీలు చేసిన మహోన్నతమైన వ్యక్తి కేసీఆర్ అని,కెసిఆర్ ముందు చూపుతో తండాలను గ్రామపంచాయతీలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఆ గ్రామపంచాయతీ బిల్లులు కూడా చెల్లించడానికి ముందుకు రావడం లేదని, ఈ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నుంచి రక్షించాల్సిన అవసరం మనందరి పై ఉందని అన్నారు.

రానున్న స్థానిక ఎలక్షన్లో మన నత్తా చాటల్సిన బాధ్యత ఉందని,రానున్నది మన ప్రభుత్వమేఅని,కెసిఆర్ ని ముఖ్యమంత్రి చేసే దిశగా మనందరం కష్టపడాల్సిన బాధ్యత ఉంది అన్నారు. ఈ రజతోత్సవ మహానభను విజయవంతం చేయాల్సిందిగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య,నాయకులు శ్రీరామ్ సుధీర్, కేతిరెడ్డి సోమానర్సింహారెడ్డి, శ్రీరామ్ సంజయ్, కాసాని హరీష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 400 కోసం మహిళ దారుణ హత్య..

హైదరాబాద్, ఏప్రిల్ 11:మహిళ మిస్టరీని పోలీసులు చాకచక్యంగా చేధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగంలతో కలిసి జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ శుక్రవారం నర్సాపూర్ పీఎస్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వెల్లడించారు.ఎస్పీ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం మూసాపేట్ గ్రామం జయరాం తాండాకు చెందిన మెగావత్ భుజాల(52) గత నెల 25వ తేదిన అదృశ్యమైందని పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ నెల 3వ తేదీన నర్సాపూర్ మున్సిపాలిటీలోని మెదక్ మార్గంలో గల డంపింగ్ యార్డ్ చెట్ల పొదల్లో కుళ్ళిన స్థితిలో ఓ మహిళ మృతదేహం ఉందని సమాచారం అందుకున్నారు. ఇక అక్కడికి చేరుకుని డెడ్‌బాడీని పరిశీలించగా.. మృతురాలిని భుజాలిగా నిర్ధారించారు. ఈ హత్య కేసు విచారణలో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి మృతురాలిని ఆటోలో తీసుకొని వెళుండడం గమనించారు.

పాత నేరస్థుడైన మహబూబ్‌నగర్ జిల్లా అయ్యవారిపల్లి తండాకు చెందిన కేతావత్ గోపాల్ ఫోటోతో సరిపోవడంతో నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా వారం రోజుల తర్వాత గోపాల్ చిక్కడంతో అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. 2023లో గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళను అత్యచేసిన కేసులో గోపాల్ జైలుకు వెళ్ళాడు. వారం రోజుల క్రితం జైలు నుండి వచ్చిన గోపాల్ కల్లు కంపౌండ్‌లో మెగావత్ భుజాలిని కూలీ పని ఉంది.. వెయ్యి రూపాయలు ఇస్తానని నమ్మబలికాడు. ఆమెను ఆటోలో నర్సాపూర్ మున్సిపాలిటీ సమీపంలోని దంపుయార్డు పక్కన గల చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి జాకెట్‌తో గొంతుకు చుట్టు హతమార్చి ఆమె వద్ద గల రూ.400 తీసుకెళ్లాడు. గతంలో కూడా గోపాల్‌పై పలు కేసులు ఉన్నాయని ఎస్పీ ఉదయ్‌కుమార్ వెల్లడించారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావ్ పూలే

– దామోదర్ రాజనర్సింహ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి.

-సంగారెడ్డిలో ఘనంగా మహాత్మా జ్యోతి రావ్ పూలే 199వ జయంతి వేడుకలు.

సంగారెడ్డి ఏప్రిల్ 11(నేటి నిజం ప్రతినిది)అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మా జ్యోతి రావ్ పూలే అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతి రావ్ పూలే 199వ జయంతి నీ పురస్కరించుకొని సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతి రావ్ పూలే విగ్రహానికి టీజీఐఐసీ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ లతో కలిసి పూలమాలలు వేసి ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మహాత్మ జ్యోతి రావు పూలే సమాజంలో అన్నగారిన వర్గాలు అభ్యున్నతికి జీవితాన్ని అంకితం ఇచ్చిన మహా నాయకుడు అన్నారు. ఆయన ఆడపిల్లల చదువు కోసం తన జీవితాన్ని అంకితం చేశాడన్నారు. సత్యశోధక సమాజం ద్వారా నిరుపేదలకు వివాహాలు జరిపించాడన్నారు. ఎన్నో పాఠశాలలు వసతి గృహాల ద్వారా అనేకమంది విద్యార్థులు జీవితాల్లో వెలుగును నింపిన మహనీయుడు అన్నారు మహిళా విద్యకు ఆంధ్రుడు పూలే అన్నారు ఆయన చూపిన మార్గమే ఈనాటి అభివృద్ధికి మూలాధారంగా నిలుస్తుంది అన్నారు. సత్యమేవ జయతే నినాదంతో సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతి రావ్ పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు ,కుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపిన మహనీయుడు జ్యోతిరావు పూలే

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 11: వెల్దండ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి ముదిరాజ్ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంటరానితనాన్ని రూపుమాపడానికి మహాత్మ జ్యోతిరావు పూలే కృషి చేశారని అన్నారు.

సంఘ సంస్కర్తగా మహిళా విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. పూలే దంపతులను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటు పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సుకం వెంకటయ్య, క్యాసారపు వెంకటయ్య, కృష్ణ ముదిరాజ్, లింగం బాలరాజ్, మల్లయ్య, మాజీ ఎంపీపీలు పుట్ట రామ్ రెడ్డి జయప్రకాష్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు మల్లేష్ ముదిరాజ్, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మల్లయ్య దుబ్బ నాగేష్, నిరంజన్, ఎర్ర శ్రీను ముదిరాజ్, శ్రీశైలం, దేవేందర్, శివ, మల్లేష్, గోపాల్, విజయ్, యాదగిరి, భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

మహిళా భారతి - తెలంగాణ సంయుక్త

ఆధ్వర్యంలో...

డా. శ్రీభాష్యం అనూరాధ

(తెలుగు అధ్యాపకులు)

"తసబ్బి" – కవితాసంకలనం

పుస్తక ఆవిష్కరణ సభ

తేది. : 18-4-2025, సాయంత్రం 5.30 ని॥లకు

స్థలం : రవీంద్ర భారతి సమావేశ మందిరం

(మొదటి అంతస్తు), హైదరాబాదు

స్వాగతం : డా. శ్రీభాష్యం యదుమోహన్ (యదుగ్రాఫిక్స్ Y8 ఛానల్ అధినేత)

సభాధ్యక్షులు : డా. నాకే శ్వరం శంకరం (అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం)

ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త : డా. సందిని సిధారెడ్డి (తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ అధ్యక్షులు)

గౌరవ అతిథి : శ్రీ మామిడి హరికృష్ణ (సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ)

విశిష్ట అతిథి : శ్రీ ఎ.కృష్ణారావు (అసోసియేట్ డైరెక్టర్, ఆంధ్రజ్యోతి)

ఆత్మీయ అతిథులు : శ్రీ బైసా దేవదాసు (ప్రధాన సంపాదకులు, నేటి నిజం పత్రిక)

శ్రీ మేక రవీంద్ర గారు (అధ్యక్షులు, సహస్ర కవిసమూహం, తెలుగు అభివృద్ధి సమితి)

శ్రీ చింతపల్లి సుదర్శన్ (విమర్శకులు, రచయిత, కవి)

పుస్తక సమీక్ష : డా. దాసోజు పద్మావతి (మహిళా భారతి అధ్యక్షులు)

వందన సమర్పణ : శ్రీమతి మూర్తి శ్రీదేవి. (ప్రధానకార్యదర్శి, అక్షర కౌముది సంస్థ)

సాహిత్యాభిమానులందరికీ సాదర స్వాగతం!

మహాత్మ జ్యోతిరావు పూలే సమానత్వానికి శాశ్వత ప్రేరణ.

-టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి.

సంగారెడ్డి ఏప్రిల్11 (నేటి నిజం ప్రతినిది)మహాత్మ జ్యోతిరావు పూలే

సమానత్వానికి శాశ్వత ప్రేరణ అని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయుడని ఆయన అనుసరించిన మార్గం అందరికీ ఆచరణీయమని టి.జి.ఐ.ఐ.సి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు.

శుక్రవారం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన జయంతోత్సవాలు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూపూలే 199 వ జయంతి సందర్భంగా ఆయన త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను స్మరించుకు న్నారు.

ఒక సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా,వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

భావితరాలకు సైతం మార్గదర్శకుడని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియడారు.

వెనుకబడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు పూలే ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సు ను కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుంద న్నారు.

జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావ్ పూలే 199 జయంతి ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించడం జరిగిందని అన్నారు . బడుగు బలహీన వర్గాలకు విద్యాపరంగా ఉపాధి పరంగా సమగ్ర అభివృద్ధిని అందించేందుకు మహాత్మ జ్యోతిరావ్ పూలే చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ సంక్షేమ అధికారి జగదీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, ప్రజా సంఘాల నాయకులు బీరయ్య యాదవ్, కూన వేణు, మురళి కృష్ణ, అనంతయ్య, దుర్గ ప్రసాద్, రామారావు, మాణిక్యం, ముప్పారం ప్రకాష్, రమేష్ గౌడ్, ఆశన్న గౌడ్, ప్రభుగౌడ్ ప్రవీణ్ కుమార్ ,బాలు, మునివల్లి సత్యనారాయణ ,రఘు ,అశోక్, విద్యార్థులు,వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి ..ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావడమనేది కష్టం

-మంత్రులు కొండ సురేఖ, సీతక్క

వరంగల్ ఏప్రిల్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: వరంగల్ పట్టణంలో మెగా జాబ్ మేళాను మంత్రులు కొండ సురేఖ, సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలో 60 కంపెనీలు పాల్గొంటాయని, 11 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావడమనేది కష్టమన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం పది వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని మంత్రులు స్పష్టం చేశారు. జాబ్‌మేళాకు నిరుద్యోగులు ఎక్కువ మంది యువత రావడంతో తొక్కిసలాట జరిగింది. ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన అద్దాలు పగిలిపోవడంతో ముగ్గురు యువతులు గాయపడ్డారు. వెంటనే వారిని ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు.

రాగంపేట రైతులు వందల ఎకరాల్లో పంట నష్టపోతున్న , వారి కష్టాలు స్థానిక ఎమ్మెల్యేకు , ప్రభుత్వానికి కనిపించడం లేదా...?

-రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి...

-రాగంపేట లో పంట పొలాలను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి పరిశీలించిన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..

కరీంనగర్, ఏప్రిల్ 11:నేటినిజం (ప్రతినిధి)చొప్పదండి మండలం రాగంపేట గ్రామంలో సాగునీళ్లు లేక చేతికి అందించిన పంట రైతుల కళ్ళముందే నష్టపోయే దుస్థితి వచ్చిందని , వందల ఎకరాల్లో నేడు పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వానికి కనిపించడం లేదా అని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రశ్నించారు. చొప్పదండి మండలం రాగం పేటలో నీళ్లు లేక పంట నష్టపోయిన ప్రాంతాలను, సమస్యల తో కోట్టుమిటాడుతున్న ఇరిగేషన్ ప్రాంతాలను జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి స్థానిక బిజేపి శ్రేణుల తో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రధానంగా రాగంపేట గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ భూములు ఎల్లంపల్లి పైప్ లైన్ స్లోయిస్ ద్వారా 200 ఎకరాల కు , శనగకుంట, పుల్లయ్యకుంట వంటి కుంటలు నింపడం ద్వారా దాదాపు 550 ఎకరాల భూమి కి సాగు నీళ్ళు వినియోగమయ్యే పరిస్థితి ఉందని, అలాగే భూగర్భ జలాలు పెరిగి , కుంటల కింద ఉన్న కాలువలు ద్వారా నీరు అంది సాగయ్యే భూములు ఉన్నాయన్నారు. రాగంపేట శివారులో ఉన్న ఎల్లంపల్లి పైప్ లైన్ స్లుయస్ చెడిపోయిందన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని , రాగంపేట గ్రామానికి చెందిన స్థానిక బిజెపి నేత , ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి మండల పరిషత్ సమావేశంలో ప్రస్తావించిన, స్థానిక ఎమ్మెల్యేకు, విన్నవించిన నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ముఖ్యంగా ఎల్లంపల్లి కి సంబంధించిన గేట్ వాల్వ్ రిపేర్ చేయించడానికి నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో చేతికి అంది వచ్చిన పంటను రక్షించుకోలేక నేడు రైతులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. రాగం పేటలో కోమటికుంట పుల్లయ్యకుంట కింద ఉన్న 500 ఎకరాల పొలాలలో సుమారు 30 ఎకరాల వరకు బీడు భూములుగా మారిపోయాయనీ ,

మరో ముప్పై ఎకరాలలో నీరందక పంటలు పూర్తిగాదెబ్బతినాన్నయన్నారు.. మిగిలిన వరి పొలాలు బావులలో ఉన్న నీరు సరిపోక 50% దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదనిచెప్పారు.ప్రధానంగాఎల్లంపల్లి పైప్ లైన్ గేట్ వాల్ రిపేరు చేయకపోవడంతో 500 ఎకరాల పంట నష్టం జరగడమే కాకుండా, స్థానికంగా రాగంపేట ఎస్సీ కాలనీ తో పాటు సగం గ్రామానికి నీరు అందించే కోమటికుంట లోని మంచినీటి బావి లో నీటిమట్టం తగ్గిపోయిందని, వేసవిలో తాగునీటికి గడ్డ కాలం ఎదురయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. అందుకే పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తక్షణ చర్యలు చేపట్టాలని, రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

గుట్ట వృద్ధుల సంక్షేమ భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం

-ప్రచార గోడపత్రికను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

-వృద్ధుల సంక్షేమమే ధ్యేయమన్న టాస్కా రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు

- జిల్లాలో టాస్కాను బలోపేతం చేస్తామన్న జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూర్ణచందర్ రాజు, వెంకటేశం నేత

-గుట్ట మండల టాస్కాను ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామన్న అధ్యక్ష కార్యదర్శులు జయమోహనాచార్య, చక్రపాణి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 11 : పుణ్యక్షేత్ర పట్టణమైన యాదగిరి గుట్టలో మండల టాస్కా (తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్) సంక్షేమ భవన నిర్మాణానికి అనువైన స్థలసేకరణ తో పాటు భవన నిర్మాణానికి ప్రభుత్వ పరంగాను వ్యక్తిగతంగానూ సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తామని వయోధికుల హర్షధ్వానాల మధ్య ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం ప్రకటించారు. స్థానిక పద్మశాలి భవనంలో గుట్ట మండల టాస్కా అధ్యక్షుడు ముడుంబై జయమోహనా చార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల టాస్కా ప్రచార గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. మండల టాస్కా ప్రధాన కార్యదర్శి పులుగం చక్రపాణి సభకు స్వాగతం పలికారు. వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వాటిని ఉధృతంగా ప్రతిగ్రామంలో ప్రచారం చేసి, ప్రజల్లో అవగాహన కల్పించాలనే కార్యక్రమం చేపట్టడం అభినందనీయం బీర్ల అయిలయ్య అన్నారు.

వయోధికులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

రాష్ట్ర ప్రభుత్వం లో వయోవృద్ధులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఆరు డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని టాస్కా రాష్ట్ర అధ్యక్షుడు పి నరసింహ రావు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కు సమర్పిం చారు.వం దమందికి పైగా వయోధికులు పాల్గొన్న ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, యర్రగుంట వెంకటేశం నేత, అఖిల భారత పద్మశాలి సత్రం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు, చిక్కా దేవదాసు,ఎర్రగుంట్ల వెంకటేశం నేత, ధీకొండ జోగయ్య, గుజ్జ నిర్మల, రాజాపేట, ఆలేరు మండలాల టాస్కా అధ్యక్షులు బల్ల దామోదర్, చింత కింది మల్లయ్య , కొప్పుల భాస్కర్ , ఎం నరసింహారెడ్డి, రాఘవుల శశికళ,నూకల సుధాకర్ రెడ్డి, ఎరుకల స్వామి,కోల ఆంజనేయులు, సరాఫ్ బాలకిషన్,గుంటి యాదగిరి, గుండ్లపల్లి మల్లేశం గౌడ్, మేడి శివకుమార్,కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, ముక్యార్ల మల్లేశం, వెంకటేశ్వర రావు, ఎర్రగుంట శేఖర్, ఎక్కలదేవి భాస్కర్,సీనియర్ పాత్రికేయులు డాక్టర్ రాగి నరాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ల పేరుతో అసత్య ఆరోపణలు..

-దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన యాజమాన్యం

హైదరాబాద్, ఏప్రిల్ 11:యూనియన్ల పేరుతో కొందరు అసత్య ఆరోపణలు చేస్తోన్న విషయం తమ దృష్టికి వచ్చిందని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం పేర్కొంది. కొంతకాలంగా తమ మనుగడ కోసం ఇష్టారీతిన మాట్లాడుతూ, ప్రకటనలు జారీ చేస్తూ ఆర్టీసీ ఉద్యోగులను గందరగోళానికి గురిచేస్తున్నారని టీజీఎన్ఆర్టీసీ యాజమాన్యం మండిపడింది.

తాజాగా ఎన్ఆర్డీఎన్ ను టీజీఎస్ఆర్టీసీ సంస్థ రద్దు చేస్తోం దంటూ ఉద్యోగులను తప్పుదారి పట్టించి, రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని టిఎస్ఆర్టిసి ప్రజా సంబంధాల అధికారులు తెలిపారు. సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఉద్దేశపూర్వకంగా చేస్తోన్న ఈ దుష్ప్రచారాన్ని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తోందని యాజమాన్యం తెలిపింది.

ఎంతో కాలం సంస్థపై ఆధారపడి జీవించి.. పదవీవిరమణ చేసిన తర్వాత బయటకు వెళ్లి టీజీఎస్ఆర్టీసీ ప్రతిష్ఠకు భంగం కలిగించే నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదు. ఇప్పటికైనా సంస్థపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని యాజమాన్యం హితవు పలుకుతోంది. తమ మనుగడ కోసం కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తోన్న ఆరోపణలను నమ్మి ఆందోళనకు గురికావొద్దని ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తోంది.

ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్ అంశాలను త్వరలోనే పరిష్కారం అవుతాయని, ఎలాంటి గందరగోళానికి గురికావొద్దని స్పష్టం చేస్తోంది.

గత మూడున్నరేళ్లుగా సంస్థలో సంక్షేమ పరంగా ఎలాంటి సంస్కరణలను యాజమాన్యం తీసుకువచ్చిందో ఉద్యోగులకు తెలుసు. యూనియన్ లీడర్లు అవేం పట్టించుకోకుండా రోజుకో ప్రకటనను జారీ చేస్తూ ఉద్యోగులను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదు.

యూనియన్ లీడర్లమంటూ కొందరు చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని, పుకార్లని నమ్మి ఆందోళనకు గురికావొద్దని ఉద్యోగులకు యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

పట్టణ బిజెపి ఆధ్వర్యంలో చలో బస్తీకి ప్రోగ్రాం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 111(నేటినిజం ప్రతినిధి): భారత జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు వేములవాడ పట్టణ బిజెపి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం వివిధ వార్డులను గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పట్టణంలోని 5,6,7,8,13,18,28 వార్డులలో పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాలలో పాల్గొని పార్టీ ఆవిర్భావ నుండి ఇప్పటివరకు పార్టీ ఆవిర్భవించిన నుండి కేవలం నాలుగేళ్లలో జాతీయ పార్టీగా అవతరించిన పరిస్థితులను గుర్తు చేస్తూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న నిధులను వివరిస్తూ, గరీబు కళ్యాణ్ అన్న యోజన పథకం కింద ఇస్తున్న సన్న బియ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమాలలో ప్రతాప రామకృష్ణ గారు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది

లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి..

హైదరాబాద్, ఏప్రిల్ 11:తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జస్టీవన్‌కుమార్, రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్ఆర్సీ) చైర్మన్‌గా మరో రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ నియమితులయ్యారు. హెచ్ఆరోసీ సభ్యులుగా శివాడి ప్రవీణ, బి.కిషోర్‌లను ప్రభుత్వం నియమించింది.

దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది సచివాలయంలో ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన సెలక్షన్ కమిటీ అభ్యర్థుల జాబితాను వడపోసి వీరి పేర్లను ఖరారు చేశారు.

జస్టిస్ ఏ.రాజశేఖర్‌రెడ్డి ప్రొఫైల్

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సిర్సనగండ్ల గ్రామంలో ఓ వ్యవసాయ కుటుంబంలో 1960, మే 4న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు జయప్రద, రామానుజరెడ్డి. హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీ నుంచి పట్టభద్రులైన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బంగారు పతకం పొందారు. 1985, ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. తొలుత మహమూద్ అలీ వద్ద ప్రాక్టీస్ చేశారు. నాలుగేళ్ల తర్వాత స్వతంత్రంగా ప్రాక్టీస్ మొదలెట్టారు. 2004లో హైకోర్టు న్యాయవాదుల సంఘం (హెచ్‌సీఏఏ) ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2004లో కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా, 2005లో అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా నియమితు లయ్యారు. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీస్ టాక్స్‌కు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా కూడా పని చేశారు. 2013, ఏప్రిల్ 12న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన.. 2014లో శాశ్వత న్యాయమూర్తిగా నియమి తులయ్యారు. 2022, ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు.

జస్టిస్ షమీమ్ అక్తర్ ప్రొఫైల్ 1961, జనవరి 1న నల్లగొండలో రహీమున్నీసా బేగం, జాన్ మహమ్మద్‌కు జన్మించారు. నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదివారు. నాగ్‌పూర్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా నుంచి న్యాయవట్టా పొందారు. 1996లో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పీజీ కాలేజ్ ఆఫ్ లా నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2006లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. 2002లో నల్లగొండ జిల్లా, సెషన్స్ జడ్జిగా నియమితులయ్యారు. తర్వాత పలు కోర్టుల్లో పనిచేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ ట్రిబ్యునల్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా, ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. హైకోర్టులో రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా పనిచేశారు. 2017లో హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2022 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు.

పరమ పూజ్య గురూజీ శ్రీ ఋషి ప్రభాకర్ జీ
నెలకొల్పిన విశ్వేశ్వర తపోక్షేత్ర,
గ్రా॥ వెంకటాపూర్, సిద్దిపేటలో

తేది: 13-04-2025 ఆదివారం
ఉదయం 10-00 గం॥లకు

శ్రీ జక్కని వేంకట రాజం రచించిన
"తైత్తిరీయోపనిషత్తు" (అనువాదం)
మరియు శ్రీ రామ శతకం (కందాలు)
గ్రంథాల ఆవిష్కరణ

సభాధ్యక్షులు
ఆర్షకవి ఆచార్య మసన చెన్నప్ప గారు
(పూర్వాధ్యక్షులు తెలుగు శాఖ, ఉ.వి.)

ఆవిష్కర్త
ఆచార్య డా॥ రేకా అశోక్‌కుమార్ జీ (బ్రహ్మోపదేశకులు)

"తైత్తిరీయోపనిషత్తు" కృతి స్వీకర్తలు
శ్రీ బైస దేవదాసు గారు
శ్రీమతి బైస వీణాదాసు గారు

విశిష్ట అతిథి
శ్రీ కుప్పా శ్రీపాద శర్మ (విద్యావేత్త)

ఆత్మీయ అతిథి
శ్రీ గంజి యాదగిరి స్వామీ జీ (యజ్ఞ, వేద పండితులు)

అందరూ ఆహ్వానితులే

భోజనానంతరం : ఋషికుల్ టౌన్‌షిప్ సన్నాహక సమావేశం

తల్లి చేతిలో కుమారుడి హత్య

కరీంనగర్, ఏప్రిల్ 11:తల్లి చేతులో కొడుకు హత్య జరిగిన సంఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల ప్రకారం.. గ్రామానికి చెందిన మహేష్ నరేష్ (33) భార్యతో విడాకులు కావడంతో తన తల్లిదండ్రులు రాజయ్య, లక్ష్మీ వద్దనే ఉంటున్నాడు.

విడాకులు కావడంతో నరేష్ మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు ఇవ్వకపోతే మృతుడు తల్లిదండ్రులను కొడుతూ, బూతులు తిడుతూ చిత్రహింసలు గురిచేసేవాడని తెలిపారు.ఈ క్రమంలో గురువారం రాత్రి 11:30 సమయంలో పడుకున్న తర్వాత నరేష్ అతిగా మద్యం సేవించి ఇంట్లోకి వచ్చి తన తల్లి లక్ష్మితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె అతడిని నెట్టివేసి అక్కడే దగ్గర్లో ఉన్న రోకలి బండతో నరేష్ తలపై, నుదుటిపై, ఛాతిపై కొట్టడంతో తీవ్ర గాయాలు కావడంతో అతన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు నరేష్ చనిపోయాడని తెలిపారని మృతుని తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మీ పై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంథని సీఐ బి రాజు తెలిపారు.

సిపిని కలిసిన ఎంపీ ధర్మపురి..

నిజామాబాద్, ఏప్రిల్ 11: నిజామాబాద్ జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్యని ఎంపీ ధర్మపురి కలిశారు. ఈరోజు (శుక్రవారం) జిల్లా కేంద్రంలోని సిపి కార్యాలయంలో ఎంపీ ధర్మ పురి అరవింద్ జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతలు, పలు అంశాలపై సిపితో ఎంపీ చర్చించారు. ఎంపీ వెంట అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి ఉన్నారు.

గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే : ఎమ్మెల్యే ముఠా గోపాల్

హైదరాబాద్, ఏప్రిల్ 11: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతి నగర్ బస్తీలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ, డివిజన్ అధ్యక్షులు రాకేష్ కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠా నరేష్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, పి.రాజమోహన్, శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్ గుప్త, పాశం రవి, పి రాజ్ కుమార్, జీ వెంకటేష్, ఎస్ టి ప్రేమ, బి కిరణ్ కుమార్, విఠల్, పి సుధాకర్, టి సంతోష్, ఎన్ శ్రీహరి, తలారి యాదగిరి, కుమారస్వామి, రచ్చ నరేష్, కే శ్రీనివాస్, మందుల నరసయ్య, చందు, సురేష్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.